ప్రతి అక్షరం ప్రజాహితం
నేటి ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com
సంపుటి - 02 సంచిక -235 పేజీలు - 08 వెల - 04/- గురువారం 26 జూన్ 2025



# అంతరిక్షంలోకి శుభాంశు శుక్లా

- యాక్సియం-4 మిషన్‌లో భారత వ్యోమగామి
- శుభాంశు శుక్లా అంతరిక్ష ప్రయాణం
- ఫ్లోరిడా నుంచి ఫాల్కన్ 9 రాకెట్ ద్వారా విజయవంతంగా నింగిలోకి
- శుభాంశు శుక్లాకు రాష్ట్రపతి, ప్రధాని మోదీ అభినందనలు
- 14 రోజుల పాటు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో బృందం సభ్యులు

భారత అంతరిక్ష యాత్రల చరిత్రలో మరో మైలురాయి ఆవిష్కృతమైంది. భారత వాయుసేనకు చెందిన గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా యాక్సియం-4 మిషన్‌లో భాగంగా అంతరిక్షంలోకి విజయవంతంగా పయనమయ్యారు. ఈ అంతర్జాతీయ బృందానికి ఆయన సారథ్యం వహిస్తున్నారు. ఈ చారిత్రాత్మక ప్రయోగం పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేస్తూ శుభాంశు శుక్లాకు, మిషన్ బృందానికి అభినందనలు తెలిపారు.

మిగతాది 2లో...

# భయాలకు తావులేదు

## పెట్టుబడులు పెట్టండి

- విజయవాడలో ఫిక్కీ జాతీయ కార్యవర్గ సమావేశం
- ముఖ్య అతిథిగా హాజరైన సీఎం చంద్రబాబు
- గతంలో పారిశ్రామికవేత్తలతో మాట్లాడటానికి నేతలు వెనుకాడేవారన్న సీఎం
- ప్రభుత్వ విధానాలు పరిశ్రమలకు అనుకూలంగా ఉన్నాయని ఫిక్కీ కితాబు
- వెనుకబడిన ప్రాంతాల్లో అధిక ప్రోత్సాహకాలు అందిస్తామన్న ముఖ్యమంత్రి
- ఉత్తరాంధ్ర, రాయలసీమ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని వెల్లడి



**అమరావతి,జూన్ 25 ఆంధ్ర ప్రగతి :** రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాల్లో పెట్టుబడులు నెలకొల్పే పరిశ్రమలకు అధిక ప్రోత్సాహకాలు అందిస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పారిశ్రామికవేత్తలకు స్పష్టం చేశారు. ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ) జాతీయ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న విస్తృత అవకాశాలను, ప్రభుత్వ ప్రాధాన్యతలను ఆయన వివరించారు.గత ఐదేళ్ల పాలన తాలూకు చేదు అనుభవాలను పెట్టుబడిదారులు మరిచిపోవాలని, ఇకపై అలాంటి భయాలకు తావులేదని చంద్రబాబు భరోసా ఇచ్చారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి దిశగా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా పనిచేస్తోందని, ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాలకు పెట్టుబడులను ఆకర్షించేలా నూతన విధానాలు తీసుకొస్తున్నామని తెలిపారు.

మిగతాది 2లో...

# ఎమర్జెన్సీ చీకటి ఘట్టం



- ఏ భారతీయుడూ మర్చిపోడు: మోదీ
- ఎమర్జెన్సీ విధించి నేటికి 50 ఏళ్లు
- 'సంవిధాన్ హత్యా దివస్'గా జరుపుకుంటున్నామన్న మోదీ

నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని విమర్శ భారతదేశ చరిత్రలో ఎమర్జెన్సీ ఒక చీకటి అధ్యాయమని, ఆ రోజులను ఏ భారతీయుడూ మరిచిపోలేరని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఇందిరా గాంధీ ప్రభుత్వం దేశంలో ఎమర్జెన్సీ విధించి నేటికి సరిగ్గా 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. ఈ రోజును దేశ ప్రజలతో పాటు తాము కూడా 'సంవిధాన్ హత్యా దివస్'గా పరిగణిస్తున్నామని తెలిపారు. మిగతాది 2లో...



## సింగయ్య మృతి కేసు...

# క్వాష్ పిటిషన్ వేసిన జగన్

- జగన్ పల్నాడు పర్యటన సందర్భంగా విషాదం
- జగన్ వాహనం కింద పడి సింగయ్య మృతి
- ఈ కేసులో ఏ2గా జగన్
- ఇప్పటికే డ్రైవర్ అరెస్ట్
- జగన్ బుల్లెట్ ప్రూఫ్ వాహనం సీజ్

**అమరావతిజూన్ 25 ఆంధ్ర ప్రగతి :** వైసీపీ అధినేత జగన్ ఇటీవలి పల్నాడు జిల్లా సత్తెనపల్లి పర్యటన సందర్భంగా విషాదకర ఘటనలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. మొత్తం ముగ్గురు వ్యక్తులు ఈ పర్యటన సందర్భంగా చనిపోయారు. మిగతాది 2లో...

## ప్రజలు, కార్యకర్తలతో

# ప్రతిరోజూ ఫీడ్ బ్యాక్

- జులై 2 నుంచి ప్రభుత్వ విజయాలను ఇంటింటికీ తీసుకెళ్లాలి - లోకేశ్ పిలుపు
- తల్లికి వందనం, మెగా డీఎస్సీ వంటి హామీల అమలు ప్రస్తావన
- అహంకారం వీడి, ఓర్పు సహనంతో ప్రజా సమస్యలు పరిష్కరించాలని సూచన
- రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా కూటమి ఏర్పాటు అన్న మంత్రి
- ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తామన్న లోకేశ్






# 'తెలంగాణ రైజింగ్ 2047' దార్శనికతకు ప్రశంస

## ముఖ్యమంత్రి రేవంత్‌కి బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్ లేఖ

హైదరాబాద్, **జూన్ 25 ఆంధ్ర ప్రగతి :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బ్రిటన్ మాజీ ప్రధానమంత్రి టోనీ బ్లెయిర్ అభినందనలు తెలుపుతూ లేఖ రాశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న 'తెలంగాణ రైజింగ్-2047' దార్శనిక ప్రణాళిక తనను ఎంతగానో ఆకట్టుకుందని ఆయన పేర్కొన్నారు. మిగతాది 2లో...

# పంచాయతీ ఎన్నికలు నిర్వహించండి

## ఆదేశాలు జారీ చేసిన హైకోర్టు

- మూడు నెలల సమయమిస్తూ తీర్పు
- చాలా కాలంగా పెండింగ్లో ఉన్న పిటిషన్లు
- 2024 జనవరిలో ముగిసిన సర్పంచుల పదవీకాలం
- గడువు ముగిసినా ఎన్నికలు చేపట్టని ప్రభుత్వం
- అడ్డంకిగా మారిన బీసీ రిజర్వేషన్ల సమస్య
- ప్రభుత్వం, పిటిషనర్ల వాదనలు విన్న న్యాయస్థానం
- సుప్రీం ఆదేశాలు ఎందుకు పాటించడం లేదని ఆగ్రహం
- వార్డు, డివిజన్ల విభజనకు నెల రోజుల సమయం
- మొత్తం స్థానిక ఎన్నికల ప్రక్రియకు మూడు నెలలు
- రాష్ట్ర ఎన్నికల సంఘానికి స్పష్టమైన ఆదేశాలు జారీ




# జగన్ ర్యాలీలపై నిషేధం విధించాలి వైఎస్ షర్మిల డిమాండ్

- సింగయ్య మృతి ఘటనలో జగన్‌పై ఏపీసీసీ చీఫ్ షర్మిల ఆగ్రహం
- మూడు కార్లకే అనుమతి ఉంటే, వేల మందితో ఎలా పర్యటిస్తారని ప్రశ్న
- ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని జగన్ పట్టించుకోలేదని ఆరోపణ
- జగన్ తీరుపై పోలీసుల నిర్లక్ష్యంపై కూడా షర్మిల విమర్శలు
- జగన్ పర్యటనలు, ప్రదర్శనలు నిషేధించాలని డిమాండ్



# అంతరిక్షంలోకి శుభాంశు శుక్లా

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్పందిస్తూ, "భారత్ నుంచి గ్రూప్ కెప్టెన్‌గా వెళ్లిన శుభాంశు శుక్లా భారత అంతరిక్ష చరిత్రలో ఒక నూతన అధ్యాయాన్ని లిఖించారు. మీ ప్రయాణం పట్ల దేశం మొత్తం గర్వంగా, సంతోషంగా ఉంది. మీరు, యాక్సియం-4 మిషన్‌లోని ఇతర దేశాల వ్యోమగాములు 'వసుధైక కుటుంబం' అనే భావనను మరోసారి ప్రపంచానికి చాటిచెప్పారు. నాసా, ఇస్రో మధ్య నెలకొన్న శాశ్వత భాగస్వామ్యానికి ఈ మిషన్ అద్దం పడుతోంది. ఈ యాత్ర సంపూర్ణంగా విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నాను. అంతరిక్ష కేంద్రంలో వ్యోమగాములు నిర్వహించే ప్రయోగాలు, శాస్త్రీయ అధ్యయనాలు భవిష్యత్ అంతరిక్ష యాత్రలకు మార్గదర్శకంగా నిలుస్తాయి" అని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా ఈ అంతరిక్ష యాత్ర విజయంపై స్పందించారు. భారత్, హంగేరీ, పోలాండ్, అమెరికా దేశాలకు చెందిన వ్యోమగాములతో కూడిన ఈ ప్రయోగం విజయవంతం కావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. భారత వ్యోమగామి, గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) వెళ్లిన తొలి భారతీయుడిగా చరిత్ర సృష్టించారని ప్రధాని మోదీ అన్నారు. కోట్లాది మంది భారతీయుల కలలు, ఆశలు, ఆకాంక్షలను శుభాంశు తనతో పాటు మోసుకెళ్లారని ఆయన అభివర్ణించారు. అమెరికాలోని ఫ్లోరిడాలో ఉన్న నాసా



కెన్నెడీ స్పేస్ సెంటర్ నుంచి బుధవారం మధ్యాహ్నం 12:01 గంటలకు (భారత కాలమానం ప్రకారం) ఫాల్కన్ 9 రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. ప్రయోగం జరిగిన నిమిషాలకే, వ్యోమగాములు ప్రయాణిస్తున్న వ్యోమనౌక రాకెట్ నుంచి విజయవంతంగా విడిపోయి, భూకక్ష్యలోకి ప్రవేశించింది. సుమారు 28 గంటల ప్రయాణం అనంతరం, గురువారం సాయంత్రం 4:30 గంటలకు (భారత కాలమానం ప్రకారం) ఈ వ్యోమనౌక అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంతో అనుసంధానం కానుంది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో శుభాంశు శుక్లా నేతృత్వంలోని బృందం 14 రోజుల పాటు బస చేస్తుంది. ఈ సమయంలో వారు భారరహిత స్థితిలో పలు కీలక ప్రయోగాలు నిర్వహిస్తారు. అంతేకాకుండా, అంతరిక్షం నుంచే ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో, పాఠశాల విద్యార్థులతో, ఇతర ప్రముఖులతో సంభాషించనున్నారు. ఈ యాత్ర ద్వారా అంతరిక్ష విజ్ఞాన రంగంలో మరిన్ని కొత్త ఆవిష్కరణలు సాధ్యమవుతాయని శాస్త్రవేత్తలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రజలు, కార్యకర్తలతో ప్రతిరోజూ ఫీడ్ బ్యాక్

## జులై 2 నుంచి ప్రభుత్వ విజయాలను ఇంటింటికీ తీసుకెళ్లాలి - లోకేశ్ పిలుపు

మచిలీపట్నం **జూన్ 25 ఆంధ్ర ప్రగతి :**

రాష్ట్రంలో నూతనంగా కొలువుదీరిన కూటమి ప్రభుత్వ విజయాలను జులై 2వ తేదీ నుంచి ప్రతి ఇంటికీ చేరవేయాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మచిలీపట్నంలో నిర్వహించిన ఉత్తమ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. పార్టీ కోసం అహర్నిశలు శ్రమించిన ఏ ఒక్క కార్యకర్తను విస్మరించేది లేదని, వారి సేవలను తప్పనిసరిగా గుర్తిస్తామని ఈ సందర్భంగా లోకేశ్ హామీ ఇచ్చారు.

ఇకపై పార్టీ అధినేత చంద్రబాబు, తాను ప్రతిరోజూ ఐదుగురు ప్రజలు, ఐదుగురు కార్యకర్తలతో నేరుగా మాట్లాడి ప్రభుత్వ కార్యక్రమాల అమలు తీరు, పార్టీ అంతర్గత సమస్యలపై ఫీడ్‌బ్యాక్ తీసుకుంటామని లోకేశ్ వెల్లడించారు. "కమ్యూనికేషన్ గ్యాప్ వల్ల కొన్ని సమస్యలు తలెత్తుతున్నాయి. పార్టీ సంస్థాగత విషయాలు, సమస్యలపై చంద్రబాబుతో ఎప్పటికప్పుడు చర్చిస్తున్నాను. పది నిర్ణయాల్లో ఒక తప్పు జరిగే అవకాశం ఉంటుంది. అలాంటి పొరపాట్లు జరిగినప్పుడు వివిధ స్థాయిల్లోని నాయకుల ద్వారా మా దృష్టికి తీసుకువస్తే వాటిని సరిదిద్దుకుంటాం" అని ఆయన అన్నారు.

గత ఎన్నికలకు ముందు నిర్వహించిన బాబు సూపర్%-%6, బాబు ష్యూరిటీ%-%భవిష్యత్తుకు గ్యారంటీ వంటి కార్యక్రమాలతో పాటు ఎన్నికల అనంతరం చేపట్టిన మన టీడీపీ, సభ్యత్వ నమోదు కార్యక్రమాల్లో కార్యకర్తలు చురుగ్గా పాల్గొన్నారని ప్రశంసించారు. పార్టీ కార్యకలాపాలను డిజిటల్ విధానంలో ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో అనుసంధానించి పనిచేసిన వారిని గుర్తించాలన్నదే తమ పార్టీ విధానమని స్పష్టం చేశారు. అధికారంలోకి వచ్చాక కూడా కేడర్‌ను మరువకుండా చంద్రబాబు, తాను ప్రతి జిల్లాకు వెళ్లినప్పుడల్లా కార్యకర్తలను కలుస్తున్నామని గుర్తుచేశారు.

**జులై 2 నుంచి గడపగడపకు వెళ్లండి**

జులై 2వ తేదీ నుంచి ప్రతిఒక్కరూ గడపగడపకు వెళ్లి, గత ఏడాది కాలంలో ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజలకు వివరించాలని లోకేశ్ దిశానిర్దేశం చేశారు. "బాబు సూపర్%-%6 కార్యక్రమాలన్నింటినీ ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నాం. తల్లికి వందనం పథకం కింద ఒకే జీఓతో రూ.8,745 కోట్లను లబ్ధిదారుల ఖాతాల్లో జమచేశాం. ఆర్థిక ఇబ్బందులు ఎదురైనప్పటికీ నిర్దేశిత సమయానికే తల్లికి వందనం పథకాన్ని విజయవంతంగా అమలుచేశాం" అని తెలిపారు.

మెగా డీఎస్సీ ద్వారా 16,347 టీచర్ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టామని, పెద్దఎత్తున పరిశ్రమలను ఆకర్షించడం ద్వారా ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనకు శాయశక్తులా కృషిచేస్తున్నామని వివరించారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా వృద్ధులకు రూ.4,000 పెన్షన్ అందిస్తున్నామన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని అమలు చేయబోతున్నామని లోకేశ్ ప్రకటించారు.

ప్రజలు అహంకారాన్ని, ఇగోలను ఏమాత్రం హర్షించరని లోకేశ్ పార్టీ శ్రేణులకు హితవు పలికారు. "గత పాలకులు అహంకారంతో వ్యవహరించడం వల్లే వారి సంఖ్య 151 నుంచి 11కి పడిపోయింది. ఏ నాయకుడైనా తప్పుగా ప్రవర్తిస్తే ఆ ప్రభావం పార్టీపై పడుతుంది. ప్రజల్లోకి వెళ్లి ఓర్పు, సహనంతో వారు చెప్పే సమస్యలను వింటూ వాటి పరిష్కారానికి కృషిచేయండి" అని సూచించారు.

గత ప్రభుత్వం కక్షసాధింపు చర్యగా నిలిపివేసిన ఉపాధి హామీ, నీరు%-%చెట్టు పథకాల బిల్లులను 90 శాతం వరకు క్లియర్ చేశామని, మిగిలిన బిల్లులను కూడా జులైలోగా అందజేసేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కార్యకర్తలపై గత ప్రభుత్వం బనాయించిన అక్రమ కేసులు, పెండింగ్‌లో ఉన్న బిల్లుల వంటి సమస్యలుంటే మంగళగిరిలోని కేంద్ర కార్యాలయానికి వచ్చి పరిష్కరించుకోవచ్చని భరోసా ఇచ్చారు.

గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచి దివాలా తీయించిందని లోకేశ్ విమర్శించారు. ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో ప్రధాని నరేంద్ర మోదీ అన్ని విధాలా సహకరిస్తూ రాష్ట్రానికి ఆక్సిజన్ అందిస్తున్నారని అన్నారు. అమరావతి, విశాఖ ఉక్కు, విశాఖ రైల్వే జోన్ వంటి అన్ని కీలక అంశాలపై ప్రధాని సానుకూలంగా ఉన్నారని తెలిపారు. "రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణ కోసమే టీడీపీ, జనసేన, బీజేపీల కూటమి ఏర్పడింది. ఈ కూటమిలో మనది పెద్దన్న పాత్ర. ఏవైనా సమస్యలుంటే కూర్చుని మాట్లాడుకుని పరిష్కరించుకుంటూ సమన్వయంతో ముందుకు సాగాలి" అని దిశానిర్దేశం చేశారు.

టీడీపీ చొరవ వల్లే వక్ఫ్ బిల్లులో నాలుగు కీలక సవరణలు చేశారని, ఇది పార్టీకి ఉన్న కమిట్‌మెంట్‌కు నిదర్శనమని పేర్కొన్నారు. పార్టీలో ఏ ఒక్క నాయకుడు కూడా గతంలో తాము పడిన ఇబ్బందులు, ఎదుర్కొన్న అవమానాలను మరువకూడదని హితవు పలికారు. చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసిన సమయంలో తాను ఆయనను కలిసేందుకు తీవ్రస్థాయిలో పోరాడాల్సి వచ్చిందని లోకేశ్ గుర్తుచేసుకున్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రులు కొల్లు రవీంద్ర, వాసంశెట్టి సుభాశ్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణపట్నం పోర్టు పీఎస్ కు కాకాణి తరలింపు...
## డీఎస్పీ ఆధ్వర్యంలో విచారణ

**జూన్ 25 ఆంధ్ర ప్రగతి :**

మాజీ మంత్రి, వైసీపీ నేత కాకాణి గోవర్ధన్ రెడ్డిని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు తమ అదుపులోకి తీసుకున్నారు. సర్వేపల్లి రిజర్వాయర్‌లో గ్రావెల్ అక్రమ రవాణాకు పాల్పడ్డారని, అలాగే పార్లమెంటు సభ్యుడు మాగుంట శ్రీనివాసులు రెడ్డి సంతకాన్ని ఫోర్జరీ చేశారన్న ఆరోపణలపై నమోదైన కేసుల్లో ఆయన నిందితుడిగా ఉన్నారు. ఈ కేసుల విచారణ నిమిత్తం నెల్లూరు జిల్లా జైలులో ఉన్న కాకాణిని సిట్ అధికారులు ఈరోజు కస్టడీలోకి తీసుకుని, కృష్ణపట్నం పోర్టు పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

సిట్ డీఎస్పీ రామాంజనేయులు నేతృత్వంలోని బృందం కాకాణిని రెండు రోజుల పాటు విచారించనుంది. ఈ విచారణ ప్రక్రియ మొత్తం ఆయన న్యాయవాది సమక్షంలో జరగనుంది. ఎంపీ మాగుంట సంతకం ఫోర్జరీ కేసులో కాకాణి ఏ2 నిందితుడిగా ఉన్నారు. ఈ కేసులో విచారణ కోసం కాకాణిని కస్టడీకి ఇవ్వాలని కోరుతూ సిట్ అధికారులు చేసిన అభ్యర్థనను రెండవ అదనపు జిల్లా మెజిస్ట్రేట్ కోర్టు ఆమోదించింది. దీంతో బాపట్ల నుంచి వచ్చిన సిట్ అధికారులు నెల్లూరు జిల్లా జైలు అధికారుల నుంచి కాకాణిని తమ కస్టడీలోకి తీసుకున్నారు. గతంలో క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలు, భారీగా పేలుడు పదార్థాల వినియోగం, అట్రాసిటీ కేసులకు సంబంధించి పోలీసులు కాకాణిని మూడు రోజుల పాటు విచారించిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో ఆయన విచారణకు ఏమాత్రం సహకరించలేదని, అధికారులు అడిగిన సుమారు 60 ప్రశ్నలలో కేవలం రెండు మూడింటికి మాత్రమే సమాధానమిచ్చి, మిగిలిన వాటికి తనకు



తెలియదని లేదా సంబంధం లేదని చెప్పినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ప్రస్తుతం సిట్ అధికారులు అడిగే ప్రశ్నలకు కాకాణి ఏ విధంగా స్పందిస్తారనేది ఆసక్తికరంగా మారింది.

సర్వేపల్లి రిజర్వాయర్‌లో నిబంధనలకు విరుద్ధంగా భారీ ఎత్తున తవ్వకాలు జరిపారన్నది కాకాణిపై ఉన్న ప్రధాన ఆరోపణ. ఈ తవ్వకాలకు అనుమతి కోసం అప్పటి ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి సంతకాన్ని ఫోర్జరీ చేశారని గత ప్రభుత్వ హయాంలోనే కేసు నమోదైంది. ఈ కేసులోనే కాకాణి రెండో నిందితుడిగా ఉన్నారు. రెండు రోజుల విచారణ అనంతరం, రేపు సాయంత్రం 5 గంటలకు కాకాణిని తిరిగి నెల్లూరు జిల్లా జైలుకు అప్పగించనున్నారు. కాగా, కాకాణి గోవర్ధన్ రెడ్డిపై పలు ఇతర కేసులు కూడా విచారణలో ఉన్నాయి. క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలు, పేలుడు పదార్థాల వినియోగం, అట్రాసిటీ కేసుల్లో ఆయన దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్లను హైకోర్టు, సుప్రీంకోర్టులు తిరస్కరించాయి. వీటితో పాటు, సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు పెట్టారన్న కేసు, ముత్తుకూరులో అక్రమంగా టోల్‌గేట్ ఏర్పాటు చేశారన్న కేసుల్లో కూడా ఆయన ప్రస్తుతం రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఈ రెండు రోజుల సిట్ విచారణలో కాకాణి ఏమైనా కీలక విషయాలు వెల్లడిస్తారా? లేదా? అనేది తేలాల్సి ఉంది.

# జగన్ ర్యాలీలపై నిషేధం విధించాలి
## వైఎస్ షర్మిల డిమాండ్

**జూన్ 25 ఆంధ్ర ప్రగతి :**

రెంటపాళ్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సింగయ్య అనే వ్యక్తి మృతి చెందిన ఘటనపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మరోమారు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై తీవ్రంగా విమర్శలు గుప్పించారు. ఈ దుర్ఘటనకు వైఎస్ జగన్ మోహన్ రెడ్డిదే బాధ్యత అని ఆమె ఆరోపించారు. గుంటూరులో బుధవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ, సింగయ్య మృతికి జగన్‌కు బాధ్యత లేదా అని షర్మిల ప్రశ్నించారు. "పోలీసులు కేవలం మూడు కార్లకు మాత్రమే అనుమతి ఇచ్చినప్పుడు, వేల మందితో కలిసి జగన్ ఎలా పర్యటన నిర్వహించారు?" అని ఆమె నిలదీశారు. ప్రమాదంలో కారు కింద పడిపోయిన వ్యక్తిని ఏమాత్రం పట్టించుకోకుండా జగన్ తన పర్యటనను కొనసాగించడం దారుణమని షర్మిల అన్నారు. జగన్ గతంలో కూడా అనేక తప్పులు చేశారని, అందుకే ఆయనపై కేసులు నమోదయ్యాయని ఆమె గుర్తు చేశారు. ఈ ఘటనలో పోలీసుల వైఖరిని కూడా షర్మిల తప్పుపట్టారు. "వేల మందితో నిబంధనలకు విరుద్ధంగా వస్తుంటే పోలీసులు ఎందుకు అడ్డుకోలేదు?" అని ఆమె ప్రశ్నించారు. జగన్ నిర్వహించే ప్రతి పర్యటన జన సమీకరణ, బలప్రదర్శన కోసమేనని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాదని ఆమె విమర్శించారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు జగన్ ఏ ఒక్క సమస్యను కూడా పట్టించుకోలేదని ఆరోపించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే, జగన్ నిర్వహించే ప్రదర్శనలు, పర్యటనలను తక్షణమే నిషేధించాలని వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. ప్రజల భద్రతను గాలికొదిలి, నిబంధనలను ఉల్లంఘిస్తూ సాగే ఇలాంటి కార్యక్రమాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు.

## సింగయ్య మృతి కేసు...
# క్వాష్ పిటిషన్ వేసిన జగన్

(మొదటి పేజీ తరువాయి) జగన్ వాహనం చక్రాల కింద్ర పడి సింగయ్య అనే వ్యక్తి దుర్మరణం చెందారు. ఈ ప్రమాదానికి సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది. ఈ ఘటనకు సంబంధించి జగన్ తో పాటు, కారు డ్రైవర్, పలువురు వైసీపీ నేతలపై కేసు నమోదయింది. ఈ కేసులో జగన్ ఏ2గా ఉన్నారు. ఇప్పటికే కారు డ్రైవర్ ను పోలీసులు అరెస్ట్ చేశారు. జగన్ బుల్లెట్ ప్రూఫ్ కారును కూడా సీజ్ చేశారు. ఈ నేపథ్యంలో జగన్ తో పాటు కేసులోని ఇతర నిందితులు ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. కేసును కొట్టివేయాలని కోరుతూ హైకోర్టులో క్వాష్ పిటిషన్ వేశారు. పిటిషన్ ను స్వీకరించిన హైకోర్టు... రేపు విచారణ జరుపుతామని తెలిపింది.

# పంచాయతీ ఎన్నికలు నిర్వహించండి

హైదరాబాద్, **జూన్ 25 ఆంధ్ర ప్రగతి :**

తెలంగాణ హైకోర్టులో స్థానిక సంస్థల ఎన్నికలపై దాఖలైన పిటిషన్లకు సంబం ధించిన తుది తీర్పును న్యాయస్థానం బుధవారం వెలువరించింది. గ్రామ పంచాయతీ ఎన్నికలను మూడు నెలల్లో నిర్వహించాలని హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. వీలైనంత త్వరగా 30 రోజుల్లో వార్డుల విభజన పూర్తిచేసి, ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘానికి సూచించింది. 2024 జనవరి 31వ తేదీన సర్పంచుల పదవీకాలం ముగిసింది. గడువు ముగిసి ఒకటిన్నరేళ్లయినా ఎన్నికలు నిర్వహించకపోవడంపై న్యాయస్థానంలో ఆరుపిటిషన్లు దాఖలు అయ్యాయి. సర్పంచ్ల పరిపాలన లేక గ్రామాల అభివృద్ధి వెనుకబడుతోందని బీఆర్ఎస్, బీజేపీ ఆరోపించాయి. గ్రామ పంచాయతీ ఎన్నికలపై తీర్పును జస్టిస్ టి .మాధవిదేవి వెలువరించారు. తొలుత పిటిషనర్ల తరపు న్యాయవాదులు కోర్టులో వాదనలు వినిపించారు. గతేడాది జనవరి 31వ తేదీతో సర్పంచుల పదవీ కాలం ముగిసినా ఇప్పటికీ ఎన్నికలు నిర్వహించకుండాప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోందన్నారు. సర్పంచులను తప్పించి పంచాయతీల బాధ్యతలను స్పెషల్ అధికారు లకు అప్పగించడం, రాజ్యాంగానికి, తెలంగాణ పంచాయ తీరాజ్ చట్టాలకు విరుద్ధం అని పేర్కొన్నారు.

**బీసీ రిజర్వేషన్ల బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే..**

కాగా, ఎన్నికల సంఘం తరపున సీనియర్ న్యాయవాది జి. విద్యాసాగర్ వాదనలు వినిపిస్తూ బీసీ రిజర్వేషన్లను ఖరారు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని తెలిపారు. ఇది పూర్తికాగానే గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు ఆమోదం తెలిపిన అనంతరం ప్రక్రియ పూర్తి చేయడానికి మరో రెండు నెలల సమయం పడుతుందన్నారు.

**రిజర్వేషన్ల ఖరారుతో పాటు**

దీనిపై న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ.. సకాలంలో ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం చర్యలు తీసుకోక పోతే స్టేట్ ఎలక్షన్ కమిషన్ చొరవ తీసుకోవాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసినందున ఆ దిశగా ఎందుకు చర్యలు తీసుకోలేదని అడిగారు. దీనికి న్యాయవాది సమాధానమిస్తూ రిజర్వేషన్ల ఖరారుతో పాటు ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వానిదేనన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి వచ్చే మూడు నెలల్లో గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వ హించాలని తీర్పును వెలువరించారు.

# ఎమర్జెన్సీ చీకటి ఘట్టం

**● ఏ భారతీయుడూ మర్చిపోడు: మోదీ**

(మొదటి పేజీ తరువాయి)

ఎమర్జెన్సీ కాలంలో నాటి పాలకులు భారత రాజ్యాంగంలో పొందుపరిచిన విలువలను పూర్తిగా పక్కనపెట్టారని ప్రధాని మోదీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ సమయంలో ప్రాథమిక హక్కులను కాలరాశారని, పత్రికా స్వేచ్ఛను దారుణంగా అణచివేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ నాయకులు, సామాజిక కార్యకర్తలు, విద్యార్థులు, చివరికి సామాన్య పౌరులను కూడా అన్యాయంగా జైళ్లలో నిర్బంధించారని ఆరోపించారు. ఆ సమయంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్నే అరెస్టు చేసినట్లుగా అనిపించిందని మోదీ వ్యాఖ్యానించారు. ఎమర్జెన్సీ నాటి భయానక పరిస్థితులను ఏ భారతీయుడూ అంత తేలికగా మరచిపోలేరని ప్రధాని పునరుద్ఘాటించారు. ఆ దుర్మార్గమైన పాలనకు వ్యతిరేకంగా పోరాడిన ప్రతి ఒక్కరికీ తాను సెల్యూట్ చేస్తున్నానని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడేందుకు సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు మొక్కవోని దీక్షతో పోరాటం చేశారని గుర్తుచేశారు. వారి అలుపెరగని పోరాటం వల్లే చివరికి ఎమర్జెన్సీని ఎత్తివేయాల్సి వచ్చిందని ఆయన పేర్కొన్నారు.

రాజ్యాంగంలోని మౌలిక సూత్రాలను మరింత బలోపేతం చేస్తామని, వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందని మోదీ తెలిపారు. పేదలు, అణగారిన వర్గాల ప్రజల కలలను సాకారం చేయడమే తమ ధ్యేయమని అన్నారు. ఈ సందర్భంగా, ఎమర్జెన్సీకి 50 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో 'ది ఎమర్జెన్సీ డైరీస్' పేరుతో తాను ఒక పుస్తకాన్ని తీసుకురాబోతున్నట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. ఆర్ఎస్ఎస్ ప్రచారక్‌గా తన ప్రస్థానం, ఎమర్జెన్సీ రోజుల్లో నెలకొన్న క్లిష్ట పరిస్థితులు, తన అనుభవాలను ఆ పుస్తకంలో వివరంగా పొందుపరచనున్నట్లు ఆయన తెలిపారు. ఈ పుస్తకం ద్వారా నాటి చీకటి రోజులకు సంబంధించిన అనేక తెలియని విషయాలు వెలుగులోకి వస్తాయని భావిస్తున్నారు.

# భయాలకు తావులేదు




(మొదటి పేజీ తరువాయి)

"ఉత్తరాంధ్ర, రాయలసీమల్లో పెట్టుబడులు పెట్టండి. రాయలసీమ ప్రాంతం గ్రీన్ ఎనర్జీ, ఎలక్ట్రానిక్స్, డిఫెన్స్, హైటెక్ పరిశ్రమలకు అనువుగా ఉంటుంది. ఉత్తరాంధ్ర జిల్లాలకు గూగుల్ వంటి సంస్థలు రానున్నాయి, విశాఖ కేంద్రంగా సీ-కేబుల్ కూడా ఏర్పాటు చేస్తున్నాం" అని ముఖ్యమంత్రి వివరించారు. గోదావరి జిల్లాల్లో ఆక్వా, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలకు మంచి అవకాశాలు ఉన్నాయని, అమరావతి పరిసరాల్లో కృత్రిమ మేధ (ఏఐ), క్వాంటం వ్యాలీ, ఇన్నోవేషన్స్‌పై దృష్టి సారిస్తున్నామని తెలిపారు. పెట్టుబడుల ద్వారా రాష్ట్రంలో సంపద సృష్టి జరగాలని, ఆ సంపదను పేదలకు సంక్షేమ రూపంలో అందించి, పేదరికం లేని సమాజాన్ని భావితరాలకు అందించడమే తన లక్ష్యమని చంద్రబాబు ఉద్ఘాటించారు. గతంలో ఐటీతో అభివృద్ధికి బాటలు వేశామని, ఇప్పుడు క్వాంటం కంప్యూటింగ్, ఏఐ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలపై దృష్టి సారించామని చెప్పారు. టెక్నాలజీ ద్వారా సామాన్యులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని ఆయన అన్నారు. ఆర్థిక అసమానతలు తగ్గించేందుకు పారిశ్రామికవేత్తలు కూడా ముందుకు వచ్చి, సామాజిక బాధ్యతగా పేదలకు సాయం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# 'తెలంగాణ రైజింగ్ 2047' దార్శనికతకు ప్రశంస

(మొదటి పేజీ తరువాయి)

ఈ బృహత్తర లక్ష్య సాధనకు తమవంతు సహకారం అందిస్తామని కూడా బ్లెయిర్ హామీ ఇచ్చారు.

కొన్ని రోజుల క్రితం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనకు వెళ్లినప్పుడు టోనీ బ్లెయిర్‌తో సమావేశమైన విషయం తెలిసిందే. ఆ భేటీ సందర్భంగా, తెలంగాణ రాష్ట్రాన్ని 2047 నాటికి అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపాలనే లక్ష్యంతో రూపొందించిన 'తెలంగాణ రైజింగ్ విజన్ 2047' గురించి రేవంత్ రెడ్డి ఆయనకు వివరించారు. ముఖ్యంగా రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించడం, ఐటీ రంగాన్ని మరింత విస్తరించడం, తెలంగాణ ఆర్థిక వ్యవస్థను ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేర్చడం వంటి కీలక లక్ష్యాలపై వారి మధ్య చర్చ జరిగింది. ఈ చర్చల నేపథ్యంలోనే టోనీ బ్లెయిర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ ఛేంజ్ సంస్థకు, తెలంగాణ ప్రభుత్వానికి మధ్య ఒక అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. 'తెలంగాణ రైజింగ్ విజన్ 2047' రూపకల్పన, దాని సమర్థవంతమైన అమలుకు సంబంధించి ఇరు పక్షాల ప్రతినిధులు ఒక లెటర్ ఆఫ్ ఇంటెంట్‌ను కూడా మార్చుకున్నారు. తాజాగా, ఈ ఒప్పందం, చర్చల కొనసాగింపుగా టోనీ బ్లెయిర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. 'తెలంగాణ రైజింగ్ 2047' దార్శనికత పట్ల తన ప్రగాఢమైన అభినందనలు వ్యక్తం చేస్తూ, ఈ లక్ష్య సాధనలో తమ ఇన్‌స్టిట్యూట్ ద్వారా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ అభివృద్ధి పట్ల రేవంత్ రెడ్డి ప్రభుత్వం చూపుతున్న నిబద్ధతను బ్లెయిర్ కొనియాడారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
గురువారం 26 జూన్ 2025

# పోలీస్ అధికారులతో జిల్లా ఎస్పీ సమీక్షా సమావేశం నిర్వహణ.

### జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా క్రైమ్ జూన్ 25:** అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం నాడు జిల్లా పోలీస్ కార్యాలయం నందు సంబంధిత అధికారులతో నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నివహించడం జరిగింది. ఈ సందర్భంగా మాదకద్రవ్య దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం ప్రతి సంవత్సరం జూన్ 26న నిర్వహించడం జరుగుతుంది.కావున మాదకద్రవ్యరహిత సమాజాన్ని సాధించడం కొరకు జిల్లాలోని వివిధ కళాశాలలు,పాఠశాలలో నిర్వహించవలసిన అవగాహన కార్యక్రమాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి ప్రజల సహకారాన్ని బలోపేతం చేయడానికి తీసుకోవలసిన చర్యలపై దిశ నిర్దేశం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు ఎస్.రవికుమార్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్, వి.రాముడు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్,జిల్లా వైద్యశాఖ అధికారి వెంకటరమణ,ఉమెన్ అండ్ చైల్డ్ డైరెక్టర్ లీలావతి,నంద్యాల గవర్నమెంట్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మరియు కృష్ణమూర్తి,లక్ష్మణ్ దాస్ ఇన్స్పెక్టర్ ఎక్సైజ్ డిపార్ట్మెంట్ మొదలగువారు పాల్గొన్నారు.

# వాసవి జాగృతి ఇంటర్నేషనల్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జోన్ 25:** వాసవి జాగృతి ఇంటర్నేషనల్ క్లబ్ నవనంది క్లబ్ అధ్యక్షుడు కూరాకు శ్రీనివాస దత్తాత్రేయ ఆధ్వర్యంలోగుప్పెడంత బియ్యం కార్యక్రమాన్ని స్థానిక గాంధీ చౌక్ కూడలి నందు నిర్వహించడమైనది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉమ్మడి జిల్లాల (కర్నూలు నంద్యాల)క్లబ్ గవర్నర్ బింగుమళ్ల శ్యామ్ సుందర్ గుప్త పాల్గొనడమైనది. ఈ సందర్భంగా శ్యాంసుందర్ గుప్త ఈ కార్యక్రమ%శీ% గురించి మాట్లాడుతూ ప్రతినెల అమావాస్య రోజు ప్రతి సభ్యుడు వారి శక్తి మేరకు బియ్యాన్ని క్లబ్ కి ఇవ్వగా ఆ బియ్యాన్ని ఏదైనా అన్నదాన కార్యక్రమానికిగాని,వృద్ధాశ్రమంలో కానీ,అనాథశ్రమం లో కానీ ఇవ్వవలెను. గత రెండు నెలలుగా అలాగే చేస్తూ ఈ నెల కొత్తదనం కోసం ఆ బియ్యాన్ని పదార్థంగా వండించి గాంధీ చౌక్ కూడలి నందు అక్కడ ఉండేవారికి,పాదచారులకు వినియోగించడమైనది. ఇలాగే ప్రతి నెల అమావాస్య రోజు సభ్యుల సహకారంతో నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్యాబినెట్ కార్యదర్శి మల్లిపెద్ది నాగరాజు, డిప్యూటీ గవర్నర్ బొగ్గరపు పుష్పలత, నవనంది క్లబ్ కోశాధికారి తేజ, ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ జనార్ధన్,సభ్యులు శివశంకర్,మనోజ్, మోహన్,వాసు,మురళి, దియ్యాల మోహన్,కృష్ణమోహన్, రంగయ్యా మల్లిఖార్జున కృష్ణమోహన్ మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 26న ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి నంద్యాలకు రాక.

### దివ్యాంగుల, వృద్ధుల కోసం ప్రత్యేక శిబిరాలు ఉపయోగించుకోండి.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 25:**
దివ్యాంగులు, వృద్ధులకు అవసరమైన సహాయాలు, ఉపకరణాలు, సాయపరికరాలు ఉచితంగా అందించేందుకు జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాలలో నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి చొరవతో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ శిబిరాలను ప్రారంభించేందుకు నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బైరెడ్డి శబరి ఈ నెల 26 వ తేదీన నంద్యాలకు రానున్నారు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఏ డి ఐ పి పథకం కింద, ఆర్టిఫిషియల్ లింబ్స్ మానుఫాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సహకారం, ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి చొరవతో ఈ ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈనెల 26వ తేదీ గురువారం ఉదయం 9 గంటలకు నంద్యాల మున్సిపల్ టౌన్ హాలులో దివ్యాంగులు, వృద్ధుల ప్రత్యేక శిభిరంను ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ప్రారంభిస్తారు. అలాగే ఈ నెల 28వ తేదీ నందికొట్కూరు మండల పరిషత్ కార్యాలయంలో, జులై 1వ తేదీ ఆళ్లగడ్డ మండల పరిషత్ కార్యాలయంలో, జూలై 4వ తేదీ ఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయంలో, జూలై 8వ తేదీ బనగానపల్లి మండల పరిషత్ కార్యాలయంలో, జూలై 11వ తేదీ డోన్ మండల పరిషత్ కార్యాలయంలో, జూలై 15వ తేదీ పాణ్యం మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఈ శిబిరాలు ఉదయం 9:00 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు కొనసాగుతాయి.ఏ డి ఐ పి పథకం ద్వారా ఉచితంగా ఇవ్వనున్న సహాయ పరికరాలు ( బ్యాటరీ ఆధారిత మోటారు ట్రై సైకిల్, చేతితో నడిపే ట్రై సైకిల్, వీల్ చైర్, హియరింగ్ ఎయిడ్స్, వాకింగ్ స్టిక్స్, కృతిమ అవయవాలు మొదలగు) ఈ పథకం కోసం దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్స్, వృద్ధులు, అర్హులు అని సదరన్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, రెండు పాస్ ఫొటో సైజ్ కలర్ ఫొటోలతో అర్హులు ఈ ప్రత్యేక శిబిరంకు వచ్చి కేంద్ర ప్రభుత్వం ద్వారా అందించే సహాయం అందుకోవాలని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కోరారు. ఈ ప్రత్యేక శిబిరాల నిర్వహణకు అవసరమైన సాంకేతిక నిపుణులను నియమించారు.నంద్యాల జిల్లా లోని దివ్యాంగులు, వృద్ధులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కోరారు.

# క్రైస్తవ మైనారిటీల అభివృద్ధికి చర్యలు.

**మైనారిటీల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత. రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్.**
**పాస్టర్లకు గౌరవ వేతనం రూ. 30 కోట్లు చెల్లింపు పై మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన ఐక్యబృందం**



**ఆంధ్ర ప్రగతి అమరావతి జూన్ 25:**
రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం మైనారిటీల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నదని రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. ఇందులో భాగంగానే క్రైస్తవ మైనారిటీల అభివృద్ధికి ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవడంతో పాటు, అమలు చేయడం జరుగుతున్నదని అన్నారు. పాస్టర్లకు గౌరవ వేతనం రూ. 30 కోట్లు ఒకేసారి విడుదల చేసి చెల్లించడం పట్ల ఆల్ ఇండియా క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ (ఐక్య) ప్రతినిధుల బృందం మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ కు కృతజ్ఞతలు తెలిపారు. వెలగపూడి సచివాలయంలోని మూడవ బ్లాక్ లో మంగళవారం రాత్రి రాష్ట్ర న్యాయ, మైనారిటీ మంత్రిత్వ శాఖ కార్యాలయంలో మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ను ఐక్య బృందం సభ్యులు కలిశారు.ఐక్య ప్రతినిధులు డాక్టర్ గోళ్ళమూడి రాజ సుందర బాబు,కే. హనోక్ బెంజిమెన్,జే. రవికాంత్, ఎం. ప్రేమ జ్యోతి బాబు తదితరుల బృందం 10 వినతులతో కూడిన పత్రాన్ని మంత్రి ఫరూక్ కు అందజేశారు.ఈ సందర్భంగా రాష్ట్రంలో క్రైస్తవులు, చర్చిలు, పాస్టర్ల రక్షణ కోసం ప్రత్యేక చట్టం రూపొందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా ఐక్య ప్రతినిధుల బృందం విజ్ఞప్తి చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా క్రైస్తవులపై జరిగిన పలు దాడులకు సంబంధించిన విషయాలను మంత్రికి వెల్లడించారు. క్రైస్తవ మతాన్ని, ఏసుక్రీస్తును అవహేళన చేసే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఐక్య సభ్యులు కోరారు. అలాగే దశాబ్దాల క్రితం క్రైస్తవ మిషనరీలు ఏర్పాటుచేసిన సమాధి తోటలు ప్రస్తుతం పూర్తిగా నిండిపోయాయని, గత రెండు దశాబ్దాలుగా ఈ సమస్య తీవ్ర రూపం దాల్చిందని, ఒకే సమాధిలో మూడు లేదా నాలుగు పార్థివ దేహాలను పూడ్చే పరిస్థితి నెలకొందని అన్నారు. క్రైస్తవులుగా చనిపోయిన వారిని, వారి పార్థివదేహాలను మట్టిలో పూడ్చడం మతాచారంగా ఉందన్న విషయానికి ప్రాధాన్యత ఇచ్చి సమాధి తోటల కు స్థలాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. పాస్టర్లుగా పనిచేస్తూ మత సంబంధ కోర్సులను పూర్తి చేసేందుకు ఆర్థిక సాయం, విద్యా వైద్య సంస్థలను నిర్వహించుకునేందుకు ప్రభుత్వ గ్రాంటు మంజూరు చేయాలని కోరారు. క్రైస్తవులు( మాల,మాదిగలు ) బీసీ-సీలుగా ఉన్నందున ఉద్యోగ అవకాశాల్లో ఒక శాతం రిజర్వేషన్ మాత్రమే లభిస్తున్నదని, బీసీ-సీ లు, పాస్టర్లు, సువార్తీకుల పిల్లలకు గ్రూప్ -1, గ్రూప్-2, గ్రూప్-3, ఆర్ ఆర్ బి తదితర ఉద్యోగాల పోటీ పరీక్షలకు ఏడాదికి కనీసం 200 మందికి సదుపాయాలు ఏర్పాటు చేసి ఉచితంగా శిక్షణ ఇవ్వాలని కోరారు. బాప్టిజం తీసుకోవడం, ఇవ్వడంపై ప్రభుత్వం ఆర్టికల్- 26 ప్రకారం కొన్ని మార్గదర్శకాలు ఇవ్వాల్సి ఉందని, సీఎం దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను పరిష్కరించాలని ఐక్య బృందం మంత్రి ఫరూక్ కు విజ్ఞప్తి చేశారు. ఈ విషయాలపై మంత్రి ఫరూక్ మాట్లాడుతూ తన దృష్టికి తీసుకు వచ్చిన పది వినతులను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకు వెళ్తానని హామీ ఇచ్చారు. మైనారిటీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, మైనారిటీల అభివృద్ధి లక్ష్యంగా గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ లో నిధులు కేటాయించిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ఐక్య విజ్ఞప్తి అంశాలపై చర్చించి తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు.

### రహదారుల భద్రత, ప్రమాదాల నివారణకు...

# పటిష్టమైన చర్యలు చేపట్టాలి.

**జిల్లాలో ఎన్ఫోర్స్మెంట్ చర్యలను మరింత కఠినతరం చేయాలి.**
**ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా ప్రమాణాలు పాటించాలి.**
**రహదారి నిబంధనలపై సంపూర్ణ అవగాహనతోనే ప్రమాదాల నివారణ.**
**నంద్యాల జిల్లాను ప్రమాదాల రహితంగా రూపొందించేందుకు కృషి చేయాలి.**
**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**






**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్, 25:**
ల్లాలో రహదారుల భద్రత మరియు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణాతో కలిసి జిల్లా స్థాయి రహదారి భద్రతా సమన్వయ సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.... ఈ ఏడాది ఏప్రిల్ మరియు రెండు నెలల్లో 98 రహదారి ప్రమాదాల జరగగా, అందులో 54 మందికి ప్రాణాంతక మరణాలు సంభవించాయన్నారు. జిల్లాలో రహదారుల్లో బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రమాదాల నివారణకు పూర్తి స్థాయిలో చేసేలా కృషి చేయాలన్నారు. ఎన్ హెచ్ 40 లోని అన్ని మీడియన్ ప్రాంతాలలో లైటింగ్ ఏర్పాట్లు పెంచాలన్నారు. రహదారులలో జిల్లాలోకి రావడానికి నాలుగు ప్రధాన రహదారులు ఉన్నాయని అందులో మహానంది, చాపిరేవుల డౌన్, చాబోలు రోడ్డు, ఆళ్లగడ్డ నుండి జిల్లాకు వచ్చే ప్రయాణికులు స్వాగతం పలికేలా మంచి పెయింటింగ్స్ వ్రాసేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమీషనర్ ను కలెక్టర్ ఆదేశించారు. అదే విధంగా ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్స్, సైన్ బోర్డ్స్, సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని నేషనల్ హైవే అధికారులను ఆదేశించారు. అదే విధంగా నూనెపల్లి నుండి బొమ్మల సత్రం వెళ్లే దారిలో సరైనా విద్యుత్ సరఫరా లేకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని పోలీసు, ఆర్ అండ్ బీ అధికారులు సమన్వయంగా పరిశీలన చేసి తగిన చర్యలు తీసుకోవాలని, అలాగే లైటింగ్ కూడా పెంచాలని చెప్పారు. ఆళ్లగడ్డ బైపాస్ ఎంట్రీ, ఎగ్జిట్ దారుల్లో ప్రమాదాలు జరగకుండా ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఎక్కువ శాతం బ్లాక్ స్పాట్స్ ఉన్నాయని, ప్రమాదాల నివారణకు పెద్ద పరిమాణంలో సైన్ బోర్డ్స్ ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యంగా 340సి రహదారి రోడ్డుకు అప్రోచ్ రోడ్డు సరైన రీతిలో అనుసంధానం చేయాలన్నారు. అదే విధంగా ఎన్హెచ్ 44 రోడ్డులో రంబుల్ స్ట్రిప్స్ తప్పనిసరిగా వేయాలన్నారు. 544డికు సంబంధించి గిద్దలూరు నుంచి నంద్యాలకు వచ్చే రహదారిలో స్పీడ్ బ్రేకర్స్, రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. హిట్ అండ్ రన్ కేసులకు సంబంధించి పెండింగ్ ఉన్న వాటిని ఆర్డీఓల త్వరితగతిన పంపేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఐరాడ్ కు సంబంధించి పెండింగ్ ఉన్న వాటిలో పోలీసు వారిని సమన్వయం చేసుకుంటూ త్వరగా కేసులు పరిష్కరించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సమర్థవతమైన సిబ్బంది ఉండేలా చూడాలని జిల్లా వైద్యాధికారిని ఆదేశించారు. పట్టణంలో సిఎంఆర్ వస్త్ర దుకాణానికి సంబంధించి పార్కింగ్ స్థలం లేకపోవడం వల్ల టౌన్ హాల్ లో పార్కింగ్ చేసుకుని అందుకు తగిన రుసుమును మున్సిపల్ నిధిలో జమ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాకు అవసరమైన స్పీడ్ గన్స్ అందజేయాలని ఉన్నతాధికారులకు లేఖ సిద్ధం చేయాలని జిల్లా రవాణా శాఖ అధికారికి సూచించారు. అనంతరం వివిధ అంశాలలో తగు సూచనలు జారీ చేశారు.
జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు సైన్ బోర్డ్స్, రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయాలన్నారు. అదే విధంగా హిట్ అండ్ రన్ కేసులకు సంబంధించి 41 కేసులు నమోదు కావడం జరిగిందని అందులో 29 కేసుల వివరాలు కలెక్టర్ కార్యాలయానికి పంపడం జరిగిందన్నారు. అధిక వేగాన్ని నియంత్రించడానికి స్పీడ్ గన్ వినియోగిస్తే ప్రమాదాలు తగ్గే అవకాశం ఉంటుందన్నారు.
సమావేశంలో నంద్యాల ఎఎస్పీ మంద జావలి అల్ఫోన్స్, ఆళ్లగడ్డ డిఎస్పీ ప్రమోద్ కుమార్, ఆర్ అండ్ బీ ఈఈ శ్రీధర్ రెడ్డి, నంద్యాల మున్సిపల్ కమీషనర్ శేషన్న, జిల్లా రవాణా అధికారి ఐశ్వర్య రెడ్డి, డిఎంహెచ్ఓ వెంకటరమణ, నేషనల్ ప్రాజెక్టు డైరెక్టర్లు, సంబంధిత శాఖ అధికారులు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో జీఎస్టీ రెవెన్యూ ఆదాయాన్ని పెంచాలి

**-పాత బకాయిలు వసూళ్లకు కృషి చేయాలి.- జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్, 25:**
జిల్లాలో జీఎస్టీ రెవెన్యూ ఆదాయాన్ని పెంచడానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి సంబంధిత శాఖ అధికారులు ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో కమర్షియల్ ట్యాక్స్ శాఖ ఆధ్వర్యంలో.. జిల్లాలో జిఎస్టీ ఆదాయాన్ని పెంచడానికి సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.... ఆర్థిక వనరులను అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పలు సూచనలు ఇవ్వడం జరిగిందని.. ఇందులో భాగంగా జిల్లాలో ఆదాయం పెంచడానికి సంబంధిత శాఖలను సమన్వయం చేసుకుంటూ తగిన చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. జిల్లాలో సుమారుగా 12,033 మంది పన్ను చెల్లింపుదారులు ఉన్నారన్నారు. జిల్లాలో ఏదైనా నూతన సంస్థ ఏర్పాటు చేస్తుంటే అందుకు తగిన సమాచారాన్ని అందజేయాలన్నారు. అలాగే జిల్లాలో ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయని అందులో ఉన్న సిబ్బందికి ప్రొఫెషనల్ టాక్స్ లోకి వచ్చారా లేదా అనేది చూడాలన్నారు. ముఖ్యంగా వస్తువుల(గూడ్స్) కు సంబంధించి రూ.40 లక్షలు, కాంట్రాక్ట్ సర్వీసులకు సంబంధించి 20 లక్షల రూపాయలు దాటిన వారి వివరాలు తెలపాలన్నారు. జిల్లాలో పాత బకాయిలకు సంబంధించి పెండింగ్ ఉన్న వసూళ్లకు వెళ్లేటప్పుడు రెవెన్యూ, పోలీసు శాఖలతో సమన్వయం చేసుకోవాలన్నారు. జిల్లాలో ఎక్కువ శాతం మైనింగ్ లీజులు ఉన్నాయని వారి నుండి అందుకు తగిన జీఎస్టీ పన్ను వసూలు చేసేలా చూడాలన్నారు. ఒక కాంట్రాక్ట్ కు సంబంధించి రూ.2.5లక్షలు దాటితే 1 శాతం సిజిఎస్టీ, 1 శాతం ఎస్జీఎస్టీ వసూలు చేయాలన్నారు. అదే విధంగా ప్రతి నెల 10వ తేదిలోపు జిఎస్టీ 7ఆర్ ను ఫైల్ చేయాలని లేని యెడల ప్రతి రోజు వంద రూపాయలు చొప్పున సంబంధిత డిడిఓ నుండి వసూలు చేయడం జరుగుతోందన్నారు.
అంతకుముందు వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమీషనర్ ఎం.సుధాకర్ రావు, డిప్యూటీ కమీషనర్ పి.సురేష్ లు వాణిజ్య పన్నుల శాఖ విధి, విధానాలు, జిఎస్టీ నిర్వహణ, జిఎస్టీ ట్యాక్సేషన్ తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.
సమావేశంలో జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, నంద్యాల వాణిజ్య పన్నుల శాఖ 1 మరియు 2 సహాయ కమీషనర్లు లక్ష్మీనాయక్, సుజిత, ఆర్డీఓలు విశ్వనాథ్, నరసింహులు, అరుణజ్యోతి, జిల్లా ఖజానా అధికారి లక్ష్మీదేవి, మున్సిపల్ కమీషనర్లు, ఎల్డిఎం, సంబంధిత జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి ప్రకటిత ఎమర్జెన్సీకి చరమగీతం పాడేందుకు సిద్ధం కండి.

## ఎమర్జెన్సీ కి వ్యతిరేకంగా మాట్లాడకుండా పోరాటాల్లో పాల్గొనకుండా ఉన్న బిజెపి నేడు బుక్స్ విడుదల చేసి ప్రజలకు తప్పుడు సంకేతాలు పంపడం విడ్డూరం





**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 25:** 1975 జూన్ 25న అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ దేశంలో ఎమర్జెన్సీని ప్రకటించి 20 నెలల పాటు భారతదేశానికి చీకటి రోజులు చూపించి ప్రజలకు వివిధ పార్టీల రాజకీయ నేతలకు ఇబ్బందులు కలిగేలా చర్యలు చేపట్టి నియంతృత్వ పాలన పాలించిన ఇందిరా గాంధీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పినట్లే గత 11 సంవత్సరాల బిజెపి పాలనలో అప్రకటిత ఎమర్జెన్సీని విధించి దేశంలోని పెట్టుబడిదారులకు కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తూ కార్మికులకు రైతులకు ప్రజలకు ఇబ్బందులు కలిగేలా పాలన సాగిస్తూ మతం పేరుతో కులం పేరుతో ప్రాంతాలను విభజించి ప్రజల మధ్యన చిచ్చుపెట్టి పాలన సాగిస్తున్న బిజెపి నియంతృత్వ పాలనకు చరమగీతం పాడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి టి రమేష్ కుమార్ అన్నారు.నంద్యాల పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఎమర్జెన్సీ విధించి 50 సంవత్సరాలు పూర్తికావస్తున్న సందర్భంగా నాడు -నేడు పరిస్థితులను వివరిస్తూ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఎం జిల్లా కార్యదర్శి టి రమేష్ కుమార్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏ నాగరాజు పాల్గొనగా ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, సిపిఎం సీనియర్ నాయకుడు తోట మద్దులు,పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు పుల్లా నర్సింహ, కే మహమ్మద్ గౌస్, పి వెంకట లింగం లతోపాటు పట్టణ కమిటీ సభ్యులు మౌలాలి, ప్రజాసంఘాల నాయకులు సుబ్బారావు, బుజ్జి, మాధవరావు, శ్రీనివాసులు, వీర సేన, హుసేని, వెంకట్రావు లతోపాటు పార్టీ సభ్యులు 50 మందికి పైగా పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమానికి పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు పుల్లా నరసింహా అధ్యక్షత వహించారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి టి రమేష్ కుమార్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏ నాగరాజు సిపిఎం సీనియర్ నాయకులు తోట మద్దులు లు మాట్లాడుతూ 25 -6-1975 నుండి 21- 3-1977 వరకు దేశంలో ఎమర్జెన్సీ విధించి ఇండియా అంటే ఇందిరా, ఇందిరా అంటే ఇండియా తప్ప మరొక మాట మాట్లాడకూడదు మాట్లాడిన రాజకీయ నేతల పైన ప్రశ్నించే వారిపై కేసులు బనాయించి జైల్లో వేయడం కార్మికులు ఎవరైనా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తే వారిని నాటి చార్జీలతో అరెస్టులతో బెదిరించి 20 నెలల పాటు దేశంలో చీకటి పరిపాలన కొనసాగించిన ఇందిరాగాంధీకి మరుసటి ఎన్నికలలో ఘోర పరాభవం ప్రజలు చూపించారని అప్పటి చీకటి రోజులను గుర్తు చేసుకుంటూ గత 11 సంవత్సరాల బిజెపి పాలనలో అంతకుమించి చీకటి రోజులు కొనసాగుతున్నాయని ముఖ్యంగా ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాన్ని ప్రజల పైన వద్దే విధానాలను వేగవంతం చేస్తుందని మతం పేరుతో ప్రజలను చిన్నాభిన్నం చేస్తూ ఇతర మతస్తులను కులస్తులను చంపడం చంపిన వారికి అందలమెక్కించడం లాంటి విధానాలను అనుసరిస్తుందని ఎవరైనా బిజెపికి వ్యతిరేకంగా మాట్లాడితే వారి మీ దేశద్రోహుల కింద కేసు బనాయించి ఏళ్ల తరబడి జైల్లో మగ్గి చనిపోయేలాగా చేస్తుందని ,ఏ రాజకీయ పార్టీ నాయకుడైన బిజెపికి వ్యతిరేకంగా మాట్లాడితే ముఖ్యమంత్రులు అని చూడకుండా ప్రతిపక్ష నాయకులను చూడకుండా సిబిఐ, ఈడీల ను వారిపై ప్రయోగించి జైలలో వేసి ఇబ్బందులకు గురిచేస్తుందని ఎవరు మాట వినకుంటే వాళ్లను బిజెపిలో చేరితే సరి లేకుంటే జైళ్ళ కు వెళ్లాల్సిందే అన్న పద్ధతిలో పాలన సాగిస్తుందని అన్నారు. అదేవిధంగా పెట్టుబడిదారులకు కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తూ రైతులకు నష్టం కలిగించే మూడు వ్యవసాయ చట్టాలను తీసుకువచ్చి వందలాది మంది రైతుల ప్రాణాలను బలిగొందని రైతులకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తారని సాక్షాత్తు ప్రధాని నరేంద్ర మోడీ రాతపూర్వక హామీలను నేటి వరకు నెరవేర్చకపోవడం దుర్మార్గమని, అదేవిధంగా బ్రిటిష్ కాలం నాటి నుండి ఉన్న 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్ లుగా కుదింపు చేసి కార్మికులను నయా బానిసలుగా చేసే విధంగా పాలన కొనసాగిస్తుందని దేశంలో ప్రజల పైన నిత్యవసర వస్తువుల ధరలు సరుకుల ధరలు విపరీతంగా పెంచుతూ ఏమి కొనాలన్నా, ఏమి తినాలన్నా, తినగలిగే కొనగలిగే పరిస్థితుల్లో లేకుండా ప్రజలను ఉక్కిరిబిక్కిరిచేసి పాలన సాగిస్తుందని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా క్రూడాయిల్ ధరలు తగ్గితే మన దేశంలో మాత్రం పెట్రోల్, డీజిల్,గ్యాస్ రేట్లు అమాంతం పెంచి ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తుందని వీటన్నిటి గురించి ఎవరు మాట్లాడినా ఏ రాజకీయ పార్టీ విమర్శించిన వారందరినీ వాళ్లపైన అక్రమ కేసులు బనాయించి జైళ్లలో వేయడం జరుగుతుందని, బిజెపి చెప్పిందే వినాలి మాట్లాడమంటేనే మాట్లాడాలి, తినమంటేనే తినాలి అనే విధమైన పాలన కొనసాగిస్తుందని అన్నారు. కాంగ్రెస్ విధించిన ఎమర్జెన్సీలో మాకు ఎలాంటి సంబంధం లేదని ప్రకటించిన పార్టీలే, సంఘాలే నేడు మేము ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాటం చేశామని పాల్గొన్నామని బుక్స్ ప్రింట్ చేసి ప్రజలకు తప్పుడు సంకేతాలను ఇవ్వడం బిజెపి పార్టీకే చెల్లుతుందని ఉన్నారు. కాంగ్రెస్ విధించిన ఎమర్జెన్సీ కంటే బిజెపి 11 ఏళ్ల పాలన ఘోరంగా ఉందని వీటిని ఎండగట్టేందుకు సిపిఎం పార్టీ కార్యకర్తలు ప్రతి ఒక్కరూ ప్రజలను చైతన్యవంతం చేసి పోరాటాలను ఉధృతం చేసి బిజెపికి పుట్టగతులు లేకుండా చేయాలని అన్నారు.

# డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చెయ్యాలి.

## సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి



పి. మహమ్మద్ రఫి,సామాజిక కార్యకర్త ,డోన్

**ఆంధ్ర ప్రగతి డోన్ జూన్ 25:** జూన్ 26 ఔషధాల దుర్వినియోగం మరియు చట్టవ్యతిరేక ఔషధాల సేవనం వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఆంధ్ర ప్రగతి డోన్ జూన్ 25: చట్ట వ్యతిరేక ఔషధాల నియంత్రణ దినోత్సవ ముఖ్య ఉద్దేశం చట్ట వ్యతిరేక(మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలు) ఔషధాలను , ఔషధాల దుర్వినియోగాన్ని అరికట్టడం ద్వారా ఆరోగ్యంతో పాటు దేశ సామాజిక, ఆర్థిక వ్యవస్థను, ప్రజల ప్రాణాలను కాపాడాలన్నదే ముఖ్య ఉద్దేశం. చట్ట వ్యతిరేక ఔషధాల వినియోగ కార్యకలాపాలకు పాల్పడడం ద్వారా సమాజంలో అనేక అకృత్యాలకు పాల్పడడం వల్ల ఎందరో అమాయకులు బలికావడం జరుగుతుంది. కావున ప్రస్తుత జీవణ సరళి లో సామాజికంగా డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాల పై అవగాహణ కలిగించాల్సిన భాధ్యత సామాజికంగా ప్రతి ఒక్కరి పై ఉన్నదని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి తెలిపారు.ప్రస్తుత సమాజంలో డ్రగ్స్ తీసుకునే వారు తీవ్ర స్థాయిలో విస్తరించడం వల్ల డ్రగ్స్ , మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల ఎందరో అమాయకులు బలి అవుతున్నారు. చాలా కుటుంబాలు నాశనమవుతున్నాయి ఎన్నో రోడ్డు ప్రమాదాలు, మరణాలు సంభవిస్తున్నాయని మనం రోజు మీడియా లో చూస్తున్నాము. ఇవన్ని ఆవేదన కలిగించే అంశాలని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి తెలిపారు. యుక్తవయస్సులో పిల్లలు పెడదోవ పట్టకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రుల పై ఉంటుంది. విద్యాలయాల్లో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాల్సి ఉందని అన్నారు. విద్యార్థులను సన్మార్గంలో నడిచేలా ఉపాధ్యాయులు సలహాలు, సూచనలు చేయాలని కోరారు. చట్టవ్యతిరేక కార్యక్రమాలు అంటే ఏమిటి? వాటి వల్ల జరిగే అనర్థాలు ఏమిటి? అనే విషయాలపై ప్రత్యేక చర్చలు జరగాలని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి తెలిపారు.మాదకద్రవ్యాలు అనగా మానవ శరీరానికి మిక్కిలి హాని కలిగించే కొన్ని పదార్థాలు. వీటిని ప్రపంచమంతా డ్రగ్స్ అని వ్యవహరిస్తారు. మాదకద్రవ్యాల వాడకం ఒక ప్రమాదకరమైన వ్యసనము ఈనాటి యువతరాన్ని దారి మళ్ళించి చెడు మార్గాల్లో నడిపిస్తున్న దురలవాట్లలో మాదక ద్రవ్యాల వినియోగం తీవ్రమైనది.ధూమపానం, మద్యపానం వంటి వ్యసనాల కన్నా తీవ్రమైన ప్రభావం చూపుతుంది. మాదక ద్రవ్యాలు వల్ల యువత వాటిని వినియోగిస్తూ చెడిపోయి దేశానికి నష్టం వాటిల్లుతుంది.వీటికి అలవాటు పడిన విద్యార్థులు, యువకులు చదువులు వదిలి సర్వస్వం కోల్పోయి నిర్భాగ్యులౌతున్నారు. ఒకసారి దీనికి బానిసలై జీవితాలు నాశనమైతాయని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి తెలిపారు. ఇలాంటి వ్యసనపరుల్ని మళ్ళీ మామూలు మనుషుల్ని చేయడం చాలా కష్టమైన పని. వీరిని డ్రగ్ అడిక్షన్ కేంద్రాలు, మానసిక వైద్యుల ద్వారా చికిత్స చేసి కాపాడవచ్చును. కావున డ్రగ్స్ రహీత సమాజం కొరకు ప్రతి ఒక్కరు కృషి చెయ్యాలని,ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించడం కోసం ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి కోరారు.

# మొక్కజొన్న మొలకలను నాశనం చేసిన అడవి పందులు..!

## పంట ఆరంభ దశలోనే రైతులకు నష్టాలు.

## పంటలను కాపాడుకునేందుకు అగచాట్లు.





**ఆంధ్ర ప్రగతి మహానంది జూన్ 25:**మహానంది మండలం బసాపురం గ్రామంలో రైతులు జ్యోతుల సుబ్బారాయుడు, మద్దిలేటి, జమాల్సా మూడున్నర ఎకరాల పొలాల్లో మొక్కజొన్న విత్తనాలు నాటారు. మంగళవారం రాత్రి పొలాల్లో మొక్కజొన్న విత్తనాలను అడవి పందులు వచ్చి తిని తీవ్ర నష్టాన్ని కలిగించాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట ఆరంభం దశలోనే నష్టాల్ని చూడాల్సి వస్తుందని తెలిపారు. గత రెండు రోజులుగా తొలకరి చినుకులు పడటంతో, మొక్కజొన్న విత్తనాలు మొలకెత్తి, పంటలు సమృద్ధిగా పండుతాయని ఆనందిస్తున్న రైతన్న ఆశలపై నీరు గారేలా అడవి పందులు దాడి చేసి పంటలను నాశనం చేశాయి. ఇప్పటికైనా అటవీ శాఖ అధికారులు స్పందించి, అడవిపందుల బారి నుంచి పంటలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

# అరటి రైతులు భీమా నమోదు చేసుకోవాలి.

## ప్రతి రైతు కౌలు కార్డులు తీసుకోవాలి.

## మండల వ్యవసాయ అధికారి నాగేశ్వర్ రెడ్డి.



**ఆంధ్ర ప్రగతి మహానంది జూన్ 25:** అరటి సాగు చేస్తున్న ప్రతి రైతు ఎకరాకు రూ. 2,750 చెల్లించి పునర్వ్యవస్థీకరించబడిన వాతావరణ ఆధారిత భీమా పథకం కింద బీమా చేసుకోవాలని,కౌలుకు తీసుకున్న ప్రతి రైతు కౌలు రైతు కార్డులు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి నాగేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.బుధవారం మహానంది మండలంలోని గాజులపల్లె, బసాపురం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అరటి పంటకు బీమా చేయడానికి ఆఖరి తేదీ జూలై 15 గా నిర్ణయించడం జరిగిందన్నారు.వరి వేసే ముందు రైతులు పచ్చి రొట్టె ఎరువులు వాడితే నేల సారవంతమై, నేలలో కర్బన శాతం పెరుగుతుందన్నారు.రైతులు విచక్షణారహితంగా రసాయనక ఎరువులు, పురుగుమందులు వాడ రాదని, సేంద్రియ వ్యవసాయం, ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు మొగ్గ చూపాలన్నారు.భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులు వాడితే, వ్యవసాయంలో ఖర్చు తగ్గించుకోవచ్చునని తెలిపారు. రైతులు ఈ ఖరీఫ్ సీజన్లో ముందస్తుగా వరి నాట్లు వేసుకోవాలని,రబీలో వేసే వరి మార్చి ఆఖరి లోపల కోత పూర్తి కావడానికి అవకాశం ఉంటుందన్నారు.మార్చి నెలాఖరులోగా రబీ వరి పంట పూర్తి అయ్యేటట్లు చూసుకుంటే, ఏప్రిల్ మాసంలో సహజంగా వచ్చే అకాల వర్షాలు, గాలుల బెడద నుండి పంటను కాపాడుకోవచ్చని తెలిపారు.అనంతరం మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణ గురించి రైతులకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పశు వైద్యులు శివానంద్, వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీనివాస రెడ్డి, ఇన్సూరెన్స్ కంపెనీ జిల్లా కోఆర్డినేటర్ సునీల్ , ఫీల్డ్ కోఆర్డినేటర్ శశిధర్, విహెచ్ఏ పల్లవి, వి ఏ ఏ కృష్ణకాంత్, రైతులు పాల్గొన్నారు.

# పొగాకు కంపెనీల నిర్లక్ష్యం వల్ల ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాన్ని ఆదుకోండి.

## ప్రభుత్వ జోక్యం చేసుకొని రైతుల ఆత్మహత్యలు జరగకుండా చూడాలి. మంగలి రామకృష్ణ రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం.



**ఆంధ్ర ప్రగతి నందికొట్కూరు జూన్ 25:** నంద్యాల జిల్లా నందికొట్కూర్ నియోజవర్గంలోని మిడుతూరు మండలం, చౌట్కూరు గ్రామానికి చెందిన పొగాకు రైతు మంగళి రామకృష్ణ,47సం.,పురుగుల మందు త్రాగి గుంటూరు వద్ద ఆత్మహత్య ప్రయత్నం చేసుకొనీ , గుంటూరు రైల్వే స్టేషన్ సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందు తున్నాడు. చికిత్స పొందుతున్న మంగలి రామకృష్ణ చౌట్కూరు గ్రామంలో తనకు గల 6 ఎకరాలుసొంత భూమితో పాటు మరో 16 ఎకరాలు , ఆంజనేయస్వామి దేవాలయం కు చెందిన మాన్యం భూమిని కౌలుకు తీసుకొని జిపిఐ మరియు అలయన్స్ వన్ కంపెనీలకు చెందిన పొగాకు పంట వేశారు. పంట కోసం పెట్టుబడిగా మరియు కౌలు చెల్లించుటకు సుమారు 30 లక్షల వరకు ఈ సంవత్సరం అప్పులు చేశాడు. అదేవిధంగా గత మూడు నాలుగు సంవత్సరాల నుండి కౌలు వ్యవసాయంలో పంటలు పండించుటకై లక్షల రూపాయలు అప్పులు చేసిన పండిన పంటలకు గిట్టుబాటు ధర లేక కనీసం పెట్టుబడులు రాక అప్పులు చెల్లించలేక ఇబ్బంది పడుతున్నాడు. ఈ పరిస్థితుల్లో ఈ సంవత్సరం పొగాకు పంట పడినా కూడా సకాలంలో అగ్రిమెంట్ కుదుర్చుకున్న జిపిఐ, మరియు అలయన్స్ కంపెనీలు తాము వద్ద ఉన్న మొత్తం పొగాకును కొనుగోలు చేయకపోవడం వల్ల, అనేకమార్లు కంపెనీల ప్రతినిధులు ఇళ్ల చుట్టూ తిరుగుతున్న కొనుగోలు చేయకపోవడం, గత నెలలో కురుస్తున్నవర్షాల వల్ల పొగాకు నాణ్యత దెబ్బ తింటుందేమో అన్న భయం, మరోవైపు అప్పులు ఇచ్చినవాళ్లు ఒత్తిడి చేయడం వల్ల నిన్నటి దినం సాయంత్రం గుంటూరు రైల్వే స్టేషన్ వద్ద ఆత్మహత్య ప్రయత్నం చేసుకోగా స్థానికులు సమీపంలోని ప్రభుత్వ హాస్పిటల్ లో చేర్చడం వల్ల ప్రస్తుతం గుంటూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ రైతుకు భార్య ప్రమీల తో పాటు ఒక కుమారుడు, కుమార్తె మరియు తమ్ముడు ,నాన్న ఉన్నారు.

మంగలి రామకృష్ణ ఆత్మహత్య ప్రయత్నానికి కారణమైన పొగాకు కంపెనీల పైన చట్టపరమైన చర్యలు వెంటనే తీసుకోవాలని, సకాలంలో పొగాకు కొనుగోలుచేయడం లేదని నంద్యాల కలక్టర్ గారికి మరియు %ణూూూ%, జాయింట్ కలెక్టర్ గార్లకు రైతు సంఘాల ద్వారాఅనేక మార్లు తెలియజేసి వినతి పత్రాలు సమర్పించినా కూడ సకాలంలోపొగాకు కొనుగోలు చేయించకపోవడం, గత నాలుగు సంవత్సరాల కౌలు వ్యవసాయం చేయడం, సకాలంలో పండిన పంటలకు ప్రభుత్వాలు మద్దతు ధరలు కల్పించకపోవడం రైతు ఆత్మహత్య చేసుకొనుటకు కారణమైనవి. అందుకుప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుంది. కావున రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని రామకృష్ణ కు మెరుగైన వైద్య సేవలు అందించాలని, పొగాకు కంపెనీల పైన కఠినమైన చర్యలు తీసుకుని పొగాకు కొనుగోలు చేయించాలని, వ్యవసాయం కోసం చేసిన అప్పులు చెల్లించుటకు తగిన ఆర్థిక సహకారం అందించి వారి కుటుంబాన్ని ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు టి .రమేష్ కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి టి. రామచంద్రుడు ప్రకటన ద్వారా ప్రభుత్వాన్ని కోరారు.

నంద్యాల జిల్లాలో మరిన్ని రైతుల ఆత్మహత్యలు పెరగకుండా ఉండాలంటే సకాలంలో జిల్లా యంత్రాంగం మరియు జిల్లా ప్రజా ప్రతినిధులు జోక్యం చేసుకొని ముఖ్యమంత్రి గారితో మాట్లాడి జిల్లాలో పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయించి, ప్రభుత్వమే రైతుల వద్ద ఉన్న మొత్తం పొగాకును కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని, రైతాంగాన్ని మోసం చేస్తున్న జిపిఐ, ఆలయన్స్ కంపెనీలపై కఠినమైన చర్యలు తీసుకొని వారి ద్వారా ఒప్పందంచేసుకున్న రేట్లప్రకారం పొగాకు కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# 70 వ వార్షికోత్సవం సందర్భంగా ఎస్బిఐ ఉద్యోగుల రక్తదానం.

## రక్తదానం చేయండి ప్రాణదాతలు కండి. -ఆళ్లగడ్డ మెయిన్ బ్రాంచ్ మేనేజర్ ఇమ్రాన్ మహమ్మద్.



**ఆంధ్ర ప్రగతి ఆళ్లగడ్డ , జూన్ 25** ఆళ్లగడ్డ పట్టణంలోని స్టేట్ బ్యాంకు ప్రధాన కార్యాలయం ఆవరణలో బుధవారం స్టేట్ బ్యాంకు 70 వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని స్టేట్ బ్యాంక్ మెయిన్ బ్రాంచ్ మేనేజర్ ఇమ్రాన్ మహమ్మద్ ఆధ్వర్యంలో, బ్యాంకు ఉద్యోగులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు, కేవీ సుబ్బారెడ్డి డిగ్రీ కళాశాల విద్యార్థులు కలిసి పెద్ద ఎత్తున రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేట్ బ్యాంక్ మేనేజర్ ఇమ్రాన్ మహమ్మద్ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. నంద్యాల ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు పాల్గొని దాతల నుండి రక్తాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా మేనేజర్ ఇమ్రాన్ మహమ్మద్ మాట్లాడుతూ తమ బ్యాంకు ఏర్పాటై 70 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తమ సంస్థలో పనిచేసే అధికారులు, సిబ్బంది అందరు స్వచ్ఛందంగా రక్తదానాన్ని చేసేందుకు ముందుకు రావడం పట్ల మేనేజర్ వారిని అభినందించారు. అన్ని దానాల కన్నా రక్తదానం ఎంతో గొప్పదని.. ఆపదలో ఉన్న వ్యక్తి ప్రాణాన్ని కాపాడేందుకు రక్తము చాలా అవసరం అని మేనేజర్ ఇమ్రాన్ మహమ్మద్ పేర్కొన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో రక్తదానానికి ముందుకు వచ్చిన దాతలకు ఫ్రూట్ జ్యూస్, బిస్కెట్లను, రక్తదాతలకు సర్టిఫికెట్లను, కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నంద్యాల జిల్లా చైర్మన్ పర్ల దస్తగిరి సూచన మేరకు ఆళ్లగడ్డ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, వీరేష్, యోగా నరసింహ, గురప్ప నాగేంద్ర విజయకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
గురువారం 26 జూన్ 2025

# దేశానికి చీకటిరోజులు చూపించిన ఇందిరాగాంధీ.!

## భారతీయులను,భారతీయులుగా బిజెపి గుర్తిస్తుంది.
## ప్రజాస్వామ్యం..హత్యగావించిన దినం. దేశభక్తుల కుటుంబాలను సన్మానించడం మహా భాగ్యం.









**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 25:** భారతదేశంలో ఎమర్జెన్సీ ప్రకటించడంతో ప్రజలకు చీకటిరోజులను అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ చూపించిందనీ బిజెపి సీనియర్ నాయకులు నరసింగరావు,నంద్యాల జిల్లా బిజెపి అధ్యక్షులు అభిరుచి మధు పేర్కొన్నారు.నంద్యాల జయంత్ హెూటల్ లో సమావేశం నిర్వహించారు. దేశవ్యాప్తంగా ఈ రోజును ప్రజాస్వామ్యం..హత్యగావించినదినంగా బీజేపీ ప్రభుత్వంనమకరణం చేసిందని అన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశంలో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ 1975 జూన్ 25 న ఎమర్జెన్సీ ప్రకటించి 20 నెలల పాటు భారతదేశానికి చీకటిరోజులు చూపించిందనీ అన్నారు.ఇండియా అంటే ఇందిరా,ఇందిరా అంటే ఇండియా తప్ప మరో మాట మాట్లాడిన ప్రతిపక్ష రాజకీయ పార్టీలు,స్వతంత్ర భావజాలం కల్గిన నాయకులు,పత్రికా స్వేచ్ఛను హరించివేస్తూ,వ్యక్తిగత స్వేచ్ఛ,స్వతంత్రం లేకుండా కఠినమైన నిర్ణయాలు తీసుకొని ప్రశ్నించే వారిని ,కనిపించిన వారిని కనిపించినట్టే జైళ్లలో వేశారన్నారు.నిరంకుశన పాలన సాగించిన దినాన్ని బీజేపీ ప్రభుత్వ ప్రజాస్వామ్యం,హత్యగావించిన దినంగా ప్రకటించిందని అన్నారు.ప్రజాస్వామ్యదేశం భారతదేశం అన్నారు.చీకటి పాలన సాగించిన ఇందిరాగాంధీ నీ మరుసటి ఎన్నికల్లో ఘోర పరాభవం ప్రజలు చూపించారని అన్నారు.నమరయోధులు,దేశభక్తుల త్యాగాలు,ఎందరో మహనీయులు పోరాటాలు చేసి స్వతంత్రం కోసం ఆంగ్లేయులను తరిమి కొట్టి స్వతంత్రం తీసుకొచ్చారని అన్నారు.స్వాతంత్రం కోసం పోరాడిన దేశభక్తులు ను గౌరవించుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశాంతవాతావరణంలో జీవిస్తున్నామంటే వారి త్యాగాలే అన్నారు.స్వాతంత్రం రాకముందు ఆంగ్లేయులు చేసిన పాలన మాదిరి స్వతంత్రం వచ్చిన తర్వాత ఇందిరా గాంధీ ఆంగ్లేయుల పాలన



కొనసాగించిందని అన్నారు.దేశభక్తి అంటే భారతీయ జనతా పార్టీ నాయకులు గుర్తుకు వస్తారన్నారు.దేశ వ్యాప్తంగా భారతీయులను, భారతీయులుగా బిజెపి పార్టీ గుర్తిస్తుంది అన్నారు.రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు జిల్లాలో ఎమర్జెన్సీ సమయంలో అరెస్ట్ చేయబడ్డ దేశభక్తులు ను గుర్తించి వారి త్యాగాన్ని కీర్తిస్తూ వారి కుటుంబసభ్యులను పండుగ వాతవరణంలో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మేడా మురళీధర్,పెద్ద సంఖ్యలో కార్యకర్తలు హాజరయ్యారు.



## డప్పు కళాకారుల పెన్షన్ ను 7000 కు పెంచాలి.
### ఎన్ కొంతలపాడు లో డప్పు నూతన పతాక ఆవిష్కరణ.



**ఆంధ్ర ప్రగతి ఓర్వకల్ జూన్ 25:** ఆదిమ సాంప్రదాయ కళాకారులైన డప్పు కళాకారుల పెన్షన్ ను 7 వేలకు పెంచాలని ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు యం డి ఆనంద్ బాబు డిమాండ్ చేశారు. బుధవారం ఓర్వకల్ మండలం, ఎన్ కొంతలపాడు గ్రామం లో 100 డప్పులతో గ్రామ ప్రారంభంలో ఉన్న ప్రభుత్వ స్కూల్ నుండి గ్రామం మొత్తం డప్పుల దరువులతో ప్రదర్శన నిర్వహించి, ఎస్సీ కాలనీ వద్ద ఏర్పాటు చేసిన కెవిపియస్, ఎపిడికేయస్ నూతన ఫోల్ కు ఎపిడికెయస్ జిల్లా కార్యదర్శి బి కరుణాకర్ పతాకాన్ని ఎగురవేశారు. ఎపిడికెయస్ జిల్లా అధ్యక్షులు జే మద్దిలేటి అధ్యక్షతన జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు యం డి ఆనంద్ బాబు, జిల్లా కార్యదర్శి బి కరుణాకర్, వ్య కా సం జిల్లా సహాయ కార్యదర్శి జి నాగన్న మాట్లాడారు.ఈసందర్బంగా వారు మాట్లాడుతూ డప్పు, చర్మ కారుల పెన్షన్ ఆన్లైన్ నమోదు ప్రక్రియను వెంటనే ప్రారంభించాలన్నారు. డప్పు పెన్షన్ దరఖాస్తు వయసును 45 సంవత్సరాలకు తగ్గించడం తో పాటు, పెన్షన్ ను 7 వేలకు పెంచాలన్నారు. డప్పు కళాకారుల అన్ని రకాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 26 నుండి జూలై 01 వరకు సచివాలయాలలో అర్జీలు ఇవ్వాలన్నారు. జూలై 02న కర్నూలు లో జిల్లా కమిటి నిర్వహించుకుని భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకుని నిర్వహించబోయే పోరాటాలకు సిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు.కార్యక్రమంలో కెవిపియస్ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్ పెద్దబాబు, మండల కార్యదర్శి గుట్టపాడు రామకృష్ణ, ఎపిడికెయస్ జిల్లా ఉపాధ్యక్ష్యులు చిన్న మారయ్య, జే వెంకటేశ్వర్లు, జిల్లా సహాయ కార్యదర్సుల గురిగింజ నాగరాజు, మల్లెపోగు దస్తగిరి, జిల్లా కమిటి సభ్యులు మధు, బైరాపురం కృష్ణ, మంద మాదన్న, మండల నాయకులు మద్దిలేటి, సురేష్, రామాంజనేయులు, వివిధ గ్రామాల నుండి హాజరైన డప్పు కళాకారులు పాల్గొన్నారు.

## నంద్యాల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో
## పొలం పిలుస్తోంది కార్యక్రమం.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల రూరల్ జూన్ 25:** అయ్యలూరు మరియు పెద్దకొట్టాల గ్రామాల యందు మండల వ్యవసాయ అధికారి నంద్యాల వారు ప్రసాద్ రావు ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం, నంద్యాల వ్యవసాయ ఉప సంచాలకులు చెన్నయ్య మాట్లాడుతూ రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించి పంటలు సాగు చేయాలని సూచించారు. అలాగే ఎరువులు మరియు పురుగుమందుల వాడకం తగ్గించి ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించుట వలన సాగు ఖర్చులు తగ్గించటమే కాకుండా నాణ్యమైన దిగుబడులు పొందగలరని తెలిపారు.ప్రతి రైతు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకొని అందుకు అనుగుణంగా



ఎరువులు వాడుకోవాలని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి నంద్యాల వారు మాట్లాడుతూ రైతులు వరి సాగుకు ముందు పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ లేదా పిల్లి పెసర లేదా మినుము సాగు చేయాలని దీనివలన భూమిలో కర్బన శాతం పెరిగి నేల సారవంతం అవుతుందని తెలిపారు. అలాగే సాలు వరి సాగు చేయటం వలన సేద్యం ఖర్చులు తగ్గించి వచ్చునని తెలిపారు. నంద్యాల మండలంలో మొక్కజొన్న పంట సాగు విస్తీర్ణం పెరుగుతుందని, ప్రస్తుతం సాగు చేసిన మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణకు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని, అందుకుగాను పొలంలో ఎకరాకు 6 లింగకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని, అక్కడక్కడ పక్షిస్థావారాలు ఏర్పాటు చేసుకోవాలని, మొదటిదశలో లీటరు నీటికి 5 మి.లీ వేపనూనె పిచికారి చేసుకోవాలని , పురుగు ఉధృతి అధికంగా ఉన్నచో ఏమామెక్టిన్ బెంజోయేట్ 0.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని తెలిపారు. పశువైద్యాధికారి శ్రీనివాస్ రెడ్డిగారు పశువులలో సోకే వ్యాధులు వాటి నివారణ చర్యలను తెలియజేశారు. గ్రామ రెవెన్యూ అధికారి సురేంద్ర మాట్లాడుతూ కౌలు రైతులు తప్పనిసరిగా పంట సాగు దారు హక్కు పత్రాలు కలిగివుండాలి అని తెలిపారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీధర్, గ్రామ వ్యవసాయ సహాయకులు షర్మిల, మాధురి, మరియు రైతులు పాల్గొన్నారు.

## 38 వార్డులో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన నంద్యాల మున్సిపల్ కమిషనర్ శేషన్న.
### 38 వార్డులో పారిశుధ్యంపై నిర్లక్ష్యం వద్దని కమిషనర్ కి సూచించిన 38 వార్డ్ ఇంచార్జ్ తాటికొండ బుగ్గ రాముడు.








**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 25:** నంద్యాల జిల్లా పరిధిలోని 38వ వార్డు వై.యస్.ఆర్ నగర్ మున్సిపల్ కమిషనర్ ఆకస్మిక తనికి నిర్వహించారు. తనిఖీ లో భాగంగా కస్తూరిభా గాంధీ హాస్టల్ నందు చుట్టుపక్కల ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి అని హాస్టల్ సిబ్బందికి సూచించారు పారిశుధ్యంపై తనిఖీ సమయంలో పారిశుధ్య కార్యకలాపాలను సిబ్బందితో పరిశీలించారు. మురుగు కాలువలను శు భ్రపరచడం, రోడ్లను శుభ్రం చేయడం, ఇంటింటికీ చెత్త సేకరణ రోడ్డు పక్కన ఉన్న పొదలను తొలగించడం, చేయాలని మున్సిపల్ సిబ్బందికి సూచించారు కమిషనర్ పారిశుధ్య సిబ్బందికి అవగాహన కల్పిస్తూ పలు సూచనలు చేశారు. రాత్రి సమయంలో 38 వార్డులో ఫాగింగ్ ఆపరేషన్లు సరిగ్గా నిర్వహించండి. రోడ్ పక్కన ఉన్న పొదలను తొలగించడం,శుభ్రపరచడం కొనసాగించాలి.దోమల పెంపకాన్ని నివారించడానికి నిలిచి ఉన్న నీటి ప్రాంతాలలో పారిశుధ్య కార్యకలాపాల గురించి వార్డు ప్రజలకు అవగాహన పెంచడానికి మైక్ ద్వారా బహిరంగ ప్రకటనలు చేయాలని సూచించారు అలాగే పెద్ద వార్డ్ అయినా వైఎస్ఆర్ నగర్ లో లో డ్రైనేజీ లు,రహదారులు ఎప్పుడు శుభ్రంగా ఉండాలని సూచించారు వార్డులో పలు ప్రాంతాల్లో కుళాయిల్లో నీటి సరఫరా పరిశీలించిన నంద్యాల మున్సిపల్ కమిషనర్ శేషన్న, 38 వార్డ్ ఇంచార్జ్ తాటికొండ బుగ్గ రాముడు మరియు మున్సిపల్ సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు.

## పుస్తకాల అమ్మకాన్ని అరికట్టలేని మండల విద్యాశాఖ.

### ఇంతవరకు ఏ ఒక్క ప్రైవేట్ పాఠశాలను విజిట్ చేయని విద్యాశాఖ.
### ప్రైవేట్ పాఠశాలలకు తొత్తులుగా వ్యవహరిస్తున్న మండల విద్యాశాఖ




**ఆంధ్ర ప్రగతి చాగలమర్రి జూన్ 25:** ఆళ్లగడ్డ నియోజకవర్గం లోని చాగలమర్రి మండలంలోని మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం ఎదుట రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిరసన తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శి జగన్, లింగమయ్య మాట్లాడుతూ, పాఠశాల తెరిచి పది రోజులు గడిచిన ప్రతిరోజు ఆయా దినపత్రికల్లో పుస్తకాల అమ్మకాలు అధిక ఫీజులు గురించి వస్తా ఉన్నది కానీ మండల విద్యాశాఖ అధికారి అనురాధ ఇంతవరకు చాగలమర్రి మండల పరిధిలోని ప్రైవేట్ పాఠశాలల్లో తనిఖీలు నిర్వహించి పుస్తకాల అమ్మకాన్ని అరికట్టలేధని ఆఫీసులకే పరిమితమైనా రని వారు ఆవేదన వ్యక్తం చేశారు, పాఠశాలల్లో పుస్తకాలు అమ్మడానికి ఒక అంగడి ఏర్పాటు చేసుకొని వెయ్యి రూపాయలు అయ్యే పుస్తకాలు నాలుగువేల నుండి 5 వేల వరకు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను నిట్ట నిలువున మోసం చేస్తున్నారని వారు విమర్శించారు. ఇంత వ్యాపారం జరుగుతున్న కూడా మండల విద్యాశాఖ అధికారి అనురాధనాకు ఏమీ తెలియదు అన్నట్లు వ్యవహరిస్తుందని, రాఘవేంద్ర హై స్కూల్ లో విచ్చలివిడిగా వరండాలో పెట్టి బుక్స్ బ్యాగ్ అమ్ముతున్నారని ఈ దినమున పేపర్ కు వచ్చిన విజిట్ చేయకపోవడం అంతర్యమేమని వారన్నారు. తక్షణమే



పాఠశాలలు విజిట్ చేసి విచ్చలివిడిగా ప్రభుత్వ నిబంధనకు వ్యతిరేకంగా నడుస్తూ విద్యా సామాగ్రి అమ్ముతున్న శ్రీ రాఘవేంద్ర స్కూల్ గుర్తింపు రద్దు చేయాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలకు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఓ నాయకులు నాయక్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# అప్రకటిత ఎమర్జెన్సీలో మన ప్రజాస్వామ్యం!




**జూన్ 25 ఆంధ్ర ప్రగతి :**
ఎమర్జెన్సీ చీకటి రోజులు పోయాయి. 50 ఏళ్ల క్రితం నాటి ఘటనలు తలచుకుంటూ నాటి ప్రధాని ఇందిరను దునుమాడుతున్నారు. అప్పటికీ ఇప్పటికీ పెద్దగా తేడా కనిపించడం లేదు. ఎమర్జీన్సీలో లేము అన్నదే కనిపిస్తుంది తప్ప..ప్రజలు అప్రకటిత ఎమర్జెన్సీలో కాలం గడుపుతున్నారు. ప్రస్తుత పాలకుల్లో ఇది బాగా కనిపిస్తోంది. పార్లమెంటులో సమస్యలపై చర్చ ఉండదు. వారు తీసుకున్న నిర్ణయాలే అమలవుతాయి. ఇష్టానుసారం ఎన్‌కౌంటర్లతో నక్సల్స్‌ను తుదముట్టించే నిరంకుశ విధానం నడుస్తోంది. అర్బన్ నక్సల్స్ పేరుతో మేధావులు గళమెత్తకుండా చేస్తున్నారు. విమర్శలను తట్టుకునే స్థితిలో నేటి పాలకులు లేరు. విపక్షాలు కూడా అధికారమే పరమావధిగా ఎత్తులు వేస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ఇదో గేమ్. ధరలు తగ్గించాలని అడగవద్దు, ఉద్యోగాలు కావాలని రోడ్డెక్కవద్దు. చదువులు కావాలని కోరుకోవద్దు. మంచి ఆరోగ్యం కావాలని డిమాండ్ చేయవద్దు. జిఎస్టీ వాతలు తగ్గించాలని ఎలుగెత్తకూడదు. వారి దయా దాక్షిణ్యాల మేరకు బతకాల్సిన దుస్థితిలో భారత ప్రజాస్వామ్యం నడుస్తుందని గుర్తించాలి. పాలకులు మాత్రమే మంచి జీవితం గడుపుతున్నారు. విమానాల్లో తిరుగుతున్నారు. ప్రజలు మాత్రం నేటికీ అర్ధాకలి, నిరుద్యోగం తదితర సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. ఎమర్జెన్సీని నిందిస్తూ మనం సాధించిన ప్రగతి ఏమిటో నేతలు చర్చించాలి. నేటికీ అధికార పక్షం, విపక్షం తమకు తోచిన విధంగా నిరంకుశ విధానాలే అవలంబిస్తున్నాయి తప్ప ప్రజల కోణంలో ఆలోచించడం లేదు. అందుకే ప్రస్తుతం దేశంలో కొత్తగా చీకటి రోజులు తాండవిస్తున్నాయి. నేతలు తమ నిరంకుశ విధానాలతోనే నేటికీ రాజ్యమేలుతున్నారు. పేరుకే ప్రజాస్వామ్యంగా మనమంతా ఘనంగా చెప్పుకుంటున్నా.. స్వేచ్ఛగా బతికే పరిస్థితి లేదు. స్వేచ్ఛగా మాట్లాడే పరిస్థితులు లేవు. ప్రభుత్వాలను విమర్శించే అవకాశం ఉండడం లేదు. ప్రభుత్వాలను విమర్శించే వేదిక లేకుండా పోయింది. పత్రికలు బాకాలుగా మారాయి. ప్రజా ఉద్యమాలను అణచివేయడంలో ఇందిరను మించి పోయారు. ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ వల్ల కేవల రాజకీయ నాయకులే జైలుకు వెళ్లారు. ఇది తప్పే. ఎమర్జెన్సీ చీకటి రోజులను నిందించాల్సిందే. కేవలం తన పదవిని కాపాడు కునేందుకు ఇందిర ఎమర్జెన్సీ అస్త్రాన్ని ఉపయోగించింది. అయితే ఆనాడు మనమంతా గుర్తించని మరోకోణం కూడా ఒకటి ఉంది. ఎమర్జెన్సీలో వ్యవస్థలన్నీ పక్కాగా నడిచాయి. గ్రామస్థాయిలో కూడా ఆఫీసులు సమయానికి నడిచాయి. ఉద్యోగులు సక్రమంగా పనిచేశారు. లంచం పుచ్చుకోవాలంటేనే వణికిపోయారు. కల్తీల బెడద తొలగింది. నిత్యావసర వస్తువుల ధరలు అదుపులో ఉన్నాయి. బ్లాక్ మార్కెటీర్ల భరతం పట్టారు. వేళకు బస్సులు, ట్రైన్‌లు నడిచాయి. ఇన్ని మంచి పనులు జరగినా ఇవన్నీ ఎప్పుడూ ప్రచారంలోకి రాలేదు. ఎందుకంటే ప్రచారకర్తలు రాజకీయ నాయకులే కనుక వీటి గురించి ఎక్కడా ప్రస్తావించలేదు. ఈనాడు అలాంటి పరిస్థితి ఎందకు లేదో ప్రజలు చర్చించాలి. అందుకే ఆనాటి ఎమర్జెన్సీని తలదన్నేలా నేటి పాలకులు తమ విధానాలను కొనసాగిస్తున్నారు. యాభై సంవత్సరాల క్రితం 1975లో అప్పటి ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ 21 నెలల పాటు దేశంలో అత్యయికస్థితిని విధించారు. తనను వ్యతిరేకించిన నేతలను జైళ్లల్లో తోసారు. అడగడానికి వీలు లేకుండా చేశారు. ఇదంతా కేవలం పదవిని కాపాడుకునే ప్రయత్నం తప్ప మరోటి కాదు. నిజంగానే ఇందిర తీసుకున్న ఈ నిరంకుశ నిర్ణయం దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించింది. జయప్రకాశ్ నారాయణ్ ఉద్యమించి జనతా పార్టీకి అంకురార్పణ చేశారు.ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించి మహామహులంతా ఒక్కటిగా చేరి జనతా పార్టీగా అధికారం చేపట్టారు. మంచి నిర్ణయాలు తీసుకున్నారు. కానీ అది ఎంతో కాలం నిలవలేదు. ప్రధాని పదవికి పోటీపడిన వారంతా జనతాపార్టీని విచ్చిన్నం చేశారు.

ఇలా జనతా సమయంలోనూ, తరవాత ఎన్టీఆర్ హయాంలోనూ ఇలాగే జరిరగింది. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ నేషనల్ ఫ్రంట్‌ను స్థాపించి,దానిని అధికారంలోకి తీసుకుని వచ్చేందుకు ప్రయత్నించినా, అదికూడా ఎక్కువ కాలం నిలవలేదు. మనదేశంలో ప్రజాస్వామ్యం వల్ల రాజకీయ నేతలు బాగుపడ్డారే తప్ప ప్రజలు బాగుపడలేదని 78 స్వాతంత్ర్యం వల్ల తెలిసింది. కొన్ని కుటుంబాలే బాగుపడుతున్నాయి. ప్రతి ఎన్నికల్లో నూ ప్రజలు ఓడిపోతున్నారు. రాజకీయ నాయకులు గెలుస్తున్నారు. నిరంకుశం పైకి కనపించకుండా అప్రకటిత ఎమర్జెన్సీ విధానాలు కొనసాగిస్తున్నారు. ప్రధానంగా వారసత్వ రాజకీయాలదే పెత్తనంగా మారింది. మళ్లీమళ్లీ తామే గెలవాలన్న కుటిల వ్యూహంతో చేస్తున్న విన్యాసాలు, పథకాలు, ప్రయత్నాలు దేశాన్ని పురోగమించడానికి అడ్డుపడుతున్నాయి. భారతదేశం బ్రిటిష్ వలస పాలన సంకెళ్లను తెంచుకున్న తర్వాత, మన ప్రజాస్వామ్యానికి ఎమర్జెన్సీ రూపంలో తీవ్రమైన ముప్పు ఎదురైందన్నది ముమ్మాటికీ నిజం. అంతకు ముందు అంటే బ్రిటిషర్ల కన్నా ముందు కూడా మొఘలులు, ఖల్జీలు, నిజాంలు ఇలా ఎందరో దేశాన్ని పాలించి భారత దేశాన్ని దోచుకున్నారు. బ్రిటిషర్లు కూడా దోచుకున్నారు. వీరంతా నిరంకుశంగానే దోచుకున్నారు. ఆ తరవాత స్వాతంత్రం ఉద్యమం జరిగి, దేశం ముక్కలుగా విభజించబడిన తరవాత దోపిడీ కొత్త రూపంలో ప్రవేశించింది. ఆనాడు రాజులు రాజ్యమేలితే ఇప్పుడు కుటుంబాలు రాజ్యమేలుతున్నాయి. నెహ్రూ వారసత్వం ఇంకా కొనసాగుతూనే ఉంది. రాహుల్‌ను ప్రధానిని చేయడమే లక్ష్యమని కాంగ్రెస్ నేతలు నిత్యం స్మరిస్తూనే ఉంటారు. వందలాది ప్రతిపక్ష నేతలను, వేలమంది కార్యకర్తలను కారాగారాల్లో నిర్బంధించింది. పౌరహక్కులకు, ప్రాథమిక హక్కులకు ఎమర్జెన్సీ పాతరేసింది. భావప్రకటన స్వేచ్ఛను, వాక్ స్వాతంత్ర్యాన్ని హరించివేసింది. శాంతియుతంగా నిరసనలు తెలియజేయడానికి కూడా ఎక్కడా ఎవరూ గుమిగూడడానికి వీల్లేకుండా చేసింది. పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు వేసింది. సెన్సార్‌షిప్ విధించింది. ఆఖరుకు న్యాయవ్యవస్థ స్వతంత్ర తకు కూడా క్లళెం వేయడానికి ప్రయత్నించింది. ఎమర్జెన్సీ ప్రకటించి ఇవన్నీ చేసిన ఇందిరనే మళ్లీ ప్రజలు ఎన్నుకున్నారు. ఆమె తనయుడినే మళ్లీ ప్రధానిగా ఎన్నుకున్నారు. ఇప్పుడు ఆయన తనయుడు రాహుల్ ప్రధాని కావాలంటూ కోసం శపథం తీసుకున్నారు. ప్రజలకు విద్య, వైద్యం అందించకుండా, కనీస వసతులు కల్పించకుండా చేస్తున్న పాలన కారణంగా ప్రజలు చైతన్యం కావడం లేదు. ఓటు బ్యాంక్ రాజకీయాల్లో ప్రజలు ఓడిపోతున్నారు. ప్రజాస్వామ్యం ముసుగులో నిరంకుశ నేతలు రాజ్యమేలు తున్నారు. యాభై సంవత్సరాల క్రితం మన ప్రజాస్వామ్య వ్యవస్థ పునాదులను కదిలించిన అత్యయిక స్థితి నేటి తరానికి చరిత్ర. దీనిగురించి తెలుసుకోవాల్సిందే. నేడు జరుగుతున్న పాలనా తీరును కూడా చర్చించాలి. నిజానికి ఆనాడు జనతా పార్టీ విజయం అత్యయిక స్థితికి ముగింపు పలికింది. ప్రజాస్వామ్య విలువలు గెలిచాయి. ఆ చీకటి కాలం నుంచి మనం నేర్చుకున్న పాఠాలను భారతదేశ ప్రజాస్వామ్య బలోపేతానికి కృషి చేయాలి. ఇది రాజకీయ నాయకుల వల్ల కాదని తేలిపోయింది. ప్రజాస్వామ్య సూత్రాలను కాపాడ టానికి, పౌర స్వేచ్ఛను రక్షించడానికి, అధికార సమతౌల్యం ఉండేలా పటిష్ఠమైన వ్యవస్థ మనగలగడానికి ప్రజలు గట్టిగా నిలబడాలి. అప్పుడే మనమంతా స్వేచ్ఛగా బతకగలం. పాలకులు కూడా ఒళ్లు దగ్గర పెట్టుకుని పాలన చేయగలరు. ఎమర్జీన్సీని వ్యతిరేకిస్తూనే, రాజకీయ నేతల అప్రకటిత ఎమెర్జెన్సీ కార్యక్రమాలను నిదీయాలి. అప్పుడే దేశానికి మంచిరోజులు వస్తాయని గుర్తించాలి.

---

## ఎమర్జెన్సీ బాధలు అనుభవాలపై పుస్తకం

### ఎక్స్ వేదికగా వెల్లడించిన ప్రధాని మోడీ




న్యూఢిల్లీ, **జూన్ 25 ఆంధ్ర ప్రగతి :** దేశంలో ఎమర్జెన్సీ విధించి జూన్ 25తో 50 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఆనాడు ఎదురైన పరిస్థితులు, ఇబ్బందులపై 'ది ఎమర్జెన్సీ డైరీస్' పేరుతో ప్రత్యేక పుస్తకాన్ని తీసుకొస్తున్నట్లు ప్రధాని మోడీ పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ ద్వారా మోడీ వెల్లడించారు. అత్యవసర పరిస్థితి అమల్లో ఉన్నప్పుడు తాను ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తగా ఉన్నట్లు తెలిపారు. ఆ సమయంలో తన ప్రయాణం ఎలా సాగిందో డైరీలో ఉందని చెప్పుకొచ్చారు. ఎమర్జెన్సీ కాలంలో చాలామందికి అనుభవాలు ఉన్నాయని.. ఎన్నో కుటుంబాలు బాధపడ్డాయని గుర్తుచేశారు. ఆనాటి పరిస్థితుల్ని యువతకు అవగాహన కల్పించాలని కోరారు. చీకటి రోజులను సోషల్ మీడియా ద్వారా పంచుకోవాలని ప్రధాని పిలుపునిచ్చారు. దేశ చరిత్రలో 1975 నుంచి 1977 వరకు చీకటి రోజులుగా మోడీ అభివర్ణించారు. ఆనాటి పరిస్థితులపై మోడీ తొలి రాజకీయ జీవితంపై బ్లూక్రాఫ్ట్ డిజిటల్ ఫౌండేషన్ 'ది ఎమర్జెన్సీ డైరీస్-ఇయర్స్ దట్ ఫోర్జ్డ్ ఎ లీడర్' పేరుతో కొత్త పుస్తకాన్ని ఆవిష్కరించింది. మోడీ వ్యక్తిగత జీవితం..రాజకీయ ప్రస్థానం..రాజకీయ నిరంకుశత్వాన్ని ప్రతిఘటించడం లో.. ప్రజాస్వామ్యాన్ని రక్షించడంలో మోడీ పాత్ర ఏంటన్న విషయాలు ఈ పుస్తకంలో పొందిపరిచారు. దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ హయంలో ఎమర్జెన్సీని ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తగా మోడీ ఎలా ఎదుర్కొన్నారో.. వాటి గురించి వివరణాత్మకంగా పుస్తకంలో ఉన్నాయని బ్లూక్రాఫ్ట్ డిజిటల్ ఫౌండేషన్ వెల్లడించింది. ఇక మోడీతో సన్నిహితంగా మెలిగిన వ్యక్తుల అభిప్రాయాలను కూడా ఇందులో పొందిపరిచారు. దేశంలో అత్యంత ప్రభావవంతమైన వ్యక్తి గురించి ఇలా పుస్తకం ముద్రించడం మొదటి ప్రయత్నంగా పేర్కొంది.

## హస్తకళలపై సావనీర్ డిజైన్ పోటీలు

### లేపాక్షి చైర్మన్ డా. పి.హరిప్రసాద్.

విజయవాడ, **జూన్ 25 ఆంధ్ర ప్రగతి :**
చేనేత హస్త కళాకారులు, కార్మికులు, డిజైన్స్, చేతిపనుల పట్ల మక్కువ కలిగి సృజనాత్మక అభిరుచి కలిగిన ఔత్సాహికుల నుండి హస్తకళల పై సావనీర్ డిజైన్ పోటీలలో పాల్గొనేందుకు దరకాస్తులు కోరుతూ అవకాశం కల్పిస్తున్నట్లు ఆంధ్రప్రదశ్ హ్యాండీక్రాఫ్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డా. పసుపులేటి హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధప్రదేశ్ హ్యాండీక్రాఫ్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్, స్టేట్ హ్యాండ్లూమ్ వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రంలోని సాంప్రదాయ హ్యాండీక్రాఫ్టలు, హ్యాండ్లూమ్స్‌లలో కొత్త సావనీర్ డిజైన్లను సృష్టించేందుకు జాతీయ డిజైన్ సంస్థ రాష్ట్ర స్థాయి డిజైన్ పోటీలను నిర్వహించన్నట్లు ఆయన తెలిపారు. 8 సంవత్సరాల వయస్సు పైబడి రాష్ట్రానికి చెందిన కళాకారులు, వీవర్స్, డిజైనర్లు, విద్యార్థులు ప్రజలు పోటీలలో పాల్గొన వచ్చునని తెలిపారు. హస్తకళలపై సామర్థ్యాన్ని పెంచడం, సాంప్రదాయ కళాకృతులు, ఆధునిక డిజైన్లను కలిపిన కొత్త ఆలోచనలను ప్రోత్సహించేందుకు పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. హ్యాండీక్రాఫ్ట్స్‌కు సంబంధించి ఎన్‌టిఆర్ జిల్లాకు చెందిన కొండపల్లి బొమ్మలు, అనకాపల్లి జిల్లాకు చెందిన ఎటికొప్పాక బొమ్మలు, తిరుపతి జిల్లాకు చెందిన చెక్కతో చెక్కవేతనం, కృష్ణా జిల్లాకు చెందిన కళంకారి బ్లాక్ ప్రింట్స్, శ్రీసత్య సాయిజిల్లాకు చెందిన చర్మపప్పేట్రీ అంశాలపై ధర్మవరం సిల్క్స్, ఉప్పాడ సిల్క్స్, వైస్ట్ కోట్స్, మంగళగిరి, బందర్, రాజమహేంద్రవరం, కృష్ణ, తూర్పు గోదావరి జిల్లాల హ్యాండ్లూమ్స్‌లపై పోటీలను నిర్వమిస్తున్నట్లు తెలిపారు. హ్యాండీక్రాఫ్ట్స్ ఆంధప్రదేశ్ సావ్‌నీర్‌లలో న్యూమాటిక్, ఆటోమేషన్, కొత్త డిజైన్లను హ్యాండ్లూమ్స్‌లో పాల్స్, స్కార్ఫ్స్, టైస్, వైస్ట్ కోట్స్ వంటి ఉపయుక్త వస్తువులను పరిచడం చేయాలన్నదే పోటీల ప్రధాన ఉద్దేశమన్నారు. ÷రిళిటీలలో వివిధ విభాగాలకు చెందిన ముగ్గురు ఉత్తమ విజేతలకు నగదు బహుమతులు ఇవ్వడం జరుగుతుందని, హ్యాండీక్రాఫ్ట్స్, హ్యాండ్లూమ్స్‌లలో ఒక్కొక్క విభాగంలో ఐదుగురు మొత్తంగా పదిమందికి మొదటి బహుమతిగా 25 వేల రూపాయలు, రెండవ బహుమతిగా 15 వేల రూపాయలు, మూడవ బహుమతిగా 10 వేల రూపాయలను పారితోషకంగా అందించడం జరుగుతుందన్నారు. జూలై 16వ తేదీ లోగా కొత్తగా సృష్టించిన సావనీర్ సమూనాలను రాష్ట్రంలోని సమీప లేపాక్షి, ఆప్కో షోరూమ్‌లలో సమర్పించాలన్నారు. పోటీల పక్రియను లేపాక్షి వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎం విశ్వ పర్యవేక్షిస్తారన్నారు.

## ఇరాన్ న్యూక్లియర్ వ్యవస్థను దెబ్బతీసాం

### కావాలనే కొందరు దీనిని తక్కువ చేసే యత్నం -అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వెల్లడి

వాషింగ్టన్, **జూన్ 25 ఆంధ్ర ప్రగతి :**
ఇరాన్‌పై జరిగిన అమెరికా వైమానిక దాడులు ఆ దేశ న్యూక్లియర్ సౌకర్యాలను పూర్తిగా ధ్వంసం చేశాయని డొనాల్డ్ ట్రంప్ చెబుతున్నారు. కానీ పలు మీడియా నివేదికల నేపథ్యంలో ఇరాన్.. న్యూక్లియర్ కార్యక్రమాన్ని కొన్ని నెలలు మాత్రమే వాయిదా వేశాయని చెబుతున్నాయి. ఈ నివేదికలను ట్రంప్ నకిలీ వార్తలని తోసిపుచ్చారు. ట్రంప్ తన ట్రూత్ సోషల్ ఎ÷-లాట్‌ఫామ్‌లో ఒక పోస్ట్‌లో ఇలా పేర్కొన్నారు. ఈ వార్తలు ప్రచురించే సీఎన్ఎన్, న్యూయార్క్ టైమ్స్‌లు కలిసి ఈ చారిత్రక విజయవంతమైన సైనిక దాడిని చిన్నబుచ్చే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. ఇరాన్‌లోని న్యూక్లియర్ సౌకర్యాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఈ మీడియా సంస్థలు ప్రజల నుంచి తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నాయని ట్రంప్ తెలిపారు. వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ కూడా ఈ నివేదికలను పూర్తిగా తప్పు అని తిరస్కరించారు. ఈ నివేదికలు ట్రంప్‌ను అవమానించేందుకు చేసిన ప్రయత్నమని ఆమె అన్నారు. 14 లక్షల కిలోల బాంబులను ఖచ్చితంగా లక్ష్యంపై వేస్తే ఏమవుతుందో అందరికీ తెలుసని అన్నారు. డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ (ఆఎం) నివేదిక



ప్రకారం, జూన్ 22న అమెరికా ఇరాన్‌లోని మూడు న్యూక్లియర్ కేంద్రాలైన ఫోర్డో, నటాంజ్, ఇస్ఫహాన్‌లపై దాడులు జరిపింది. అయితే ఈ దాడుల్లో ఇరాన్ న్యూక్లియర్ ప్రధాన భాగాలను ధ్వంసం కాలేదని , కేవలం కొన్ని నెలల తర్వాత వాయిదా వేశారని ఈ నివేదిక చెబుతోంది. ఈ సౌకర్యాలకు నష్టం జరిగినప్పటికీ, ఇరాన్ న్యూక్లియర్ మౌలిక సౌకర్యాలు చాలా వరకు సురక్షితంగా ఉన్నాయని తెలుస్తోంది. ఈ షయంపై సమాచారం ఇచ్చిన ఇద్దరు వ్యక్తులు, గుర్తింపు వెల్లడించకుండా, ఈ దాడులు ఫోర్డో, నటాంజ్, ఇస్ఫహాన్ సౌకర్యాలకు నష్టం కలిగించినప్పటికీ, వాటిని పూర్తిగా ధ్వంసం చేయలేకపోయాయని చెప్పారు. ఇరాన్‌లోని అత్యంత సుసంపన్నమైన యురేనియం కొన్ని స్థలాల నుంచి దాడులకు ముందే తరలించబడి సురక్షితంగా ఉందని, సెంట్రిఫ్యూజ్‌లు కూడా చాలా వరకు సురక్షితంగా ఉన్నాయని వారు తెలిపారు. ఫోర్డోలోని లోతైన భూగర్భ యురేనియం శుద్ధి కర్మాగారం వద్ద ప్రవేశ ద్వారం కూలిపోయింది. మౌలిక సౌకర్యాలకు నష్టం జరిగింది. అయితే, భూగర్భంలోని ప్రధాన నిర్మాణాలు ధ్వంసం కాలేదని ఒక వ్యక్తి తెలిపారు. గతంలో జరిగిన అంచనాలు కూడా ఈ ఫలితాన్ని హెచ్చరించాయని ఆ వ్యక్తి చెప్పారు. ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఈ దాడులు పూర్తి విజయవంతమయ్యాయని చెప్పినప్పటికీ, డిఐఏ నివేదిక వారి వాదనలను ఖండిస్తోంది. ఈ దాడులు ఇరాన్ న్యూక్లియర్ కార్యక్రమాన్ని గణనీయంగా దెబ్బతీసినప్పటికీ, దానిని పూర్తిగా నాశనం చేయలేకపోయాయని నివేదిక స్పష్టం చేస్తోంది. ఇది అమెరికా, ఇజ్రాయెల్ నాయకుల వాదనలకు విరుద్ధంగా ఉంది. ఈ వివాదం ప్రస్తుతం అంతర్జాతీయంగా చర్చనీయాంశంగా మారింది.

## తేజేశ్వర్ కేసులో ప్రధాన నిందితుడి అరెస్టు

హైదరాబాద్, **జూన్ 25 ఆంధ్ర ప్రగతి :**
: తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర సంచలనం సృష్టించిన సర్వేయర్ తేజేశ్వర్ హత్య కేసులో ట్విస్టుల మీద ట్విస్టులు, ఊహించని విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. అయితే ఈ కేసులో ప్రధాని నిందితుడైన బ్యాంక్ మేనేజర్ తిరుమలరావును పోలీసులు బుధవారం శంషాబాద్ ఎయిర్‌ఫోర్ట్ సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి పూర్తి వివరాల్లోకి వెళ్తే.. గద్వేల్‌కు చెందిన సర్వేయర్ తేజేశ్వర్‌ను పెళ్లైన నెల రోజులలోపే భార్య ఏకంగా ఐదు సార్లు హత్య చేసేందుకు ప్రయత్నించింది. ఫైనల్‌గా ఆరోసారి ఆమె అనుకున్నది సాధించింది. ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన తేజేశ్వర్ భార్య ఐశ్వర్య.. నెల రోజుల క్రితం తేజేశ్వర్‌ను ప్రేమ వివాహం చేసుకుంది. కానీ, అంతకంటే ముందు ఐశ్వర్యకు కర్నూల్‌లోని ఓ బ్యాంక్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్న తిరుమలరావు అనే వ్యక్తితో సంబంధం ఉంది. తిరుమలరావు పనిచేసే బ్యాంక్‌లో ఐశ్వర్య తల్లి పనిచేసేది. ఈ క్రమంలోనే ఆమెకు, బ్యాంక్ మేనేజర్ తిరుమలరావుకు శారీరక సంబంధం ఏర్పడింది. ఆ తర్వాత తిరుమలరావుకు ఐశ్వర్యతో కూడా పరిచయం అయింది. ఆ పరిచయం కాస్త ప్రేమగా మారింది. తిరుమలరావుకి అప్పటికే వివాహం అయినా అతనికి



పిల్లలు లేరు. దీంతో.. ఐశ్వర్యను రెండో వివాహం చేసుకోవాలని తిరుమలరావు భావించాడు. అందుకే ఐశ్వర్య కూడా ఒప్పుకుంది. ఇలా ఏకకాలంలో తల్లీ కూతుళ్లతో తిరుమలరావు సంబంధం కొనసాగించాడు. కానీ, గద్వేల్‌కు చెందిన సర్వేయర్ తేజేశ్వర్‌ను ఐశ్వర్య పెళ్లి చేసుకుంది. కానీ పెళ్లైన కొన్ని రోజులకే తిరుమలరావుతో ఐశ్వర్య మళ్లీ టచ్‌లోకి వెళ్లింది. ఎలాగైనా తేజేశ్వర్‌ను వదిలించుకొని నీతో వచ్చేస్తానంటూ అతనికి చెప్పింది. దీంతో తిరుమలరావు, ఐశ్వర్య కలిసి తేజేశ్వర్ హత్యకు ప్లాన్ వేశారు. తిరుమలరావు తేజేశ్వర్‌ను హత్య చేసేందుకు కొంత మందికి 75 వేల సుపారీ ఇచ్చాడు. అతడి వద్ద డబ్బు తీసుకున్నవారిలో ప్రధాన నిందితుడైన మనోజ్ అనే వ్యక్తి. తేజేశ్వర్ సర్వేయర్ కావడంతో సర్వే పేరుతో అతణ్ని బయటకు తీసుకెళ్లాడు. ఈనెల 17న తేజేశ్వర్ ను ల్యాండ్ సర్వే పేరుతో నగేష్, పరశురాం, రాజు అనే ముగ్గురు వ్యక్తులు ఇంట్లోంచి బయటకు పిలిచారు. కారులో ఎక్కించుకొని తీసుకెళ్లారు. ముందు సీట్లో కూర్చున్న తేజేశ్వర్ మెడ పట్టుకొని రాజు, పరశురామ్ కత్తితో పొడిచారని తెలిపారు పోలీసులు. ఆ తరువాత డ్రైవర్ సీట్లో ఉన్న నగేష్ తేజేశ్వర్ కడుపులో కత్తితో పొడిచాడన్నారు. చనిపోయిన తరువాత కర్నూలు శివారులో మృతదేహాన్ని పడేశారు. డెడ్‌బాడీని చూసిన తరువాత సుపారీ బ్యాచ్ కి రూ.2లక్షలు ఇచ్చాడు తిరుమలరావు. మర్డర్‌కు ముందు బ్యాంక్ నుంచి తిరుమలరావు రూ.20 లక్షల లోన్ తీసుకున్నాడు. ఆ హత్య తరువాత ఐశ్వర్యతో కలిసి లడఖ్ వెళ్లేందుకు తిరుమలరావు ప్లాన్ వేసుకున్నాడు. అయితే తేజేశ్వర్ కనిపించడం లేదంటూ అతని తమ్ముడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని.. తేజేశ్వర్ ఫోన్ లోకేషన్ ఆధారంగా గద్వేల్ పోలీసులు కర్నూల్‌కు వెళ్లి ఓ చెరువు వద్ద తేజేశ్వర్ మృతదేహాన్ని కనిపెట్టారు. మృతదేహంపై అమ్మ అనే పచ్చబొట్టు ఆధారంగా అది తేజేశ్వర్ మృతదేహంగా నిర్ధారించారు.

# చెత్త ఫీల్డింగ్, లోయరార్డర్ వైఫల్యం

## ఏ ఒకరి వల్లో ఈ పరాజయం ఎదురవ్వలేదు -తొలి టెస్ట్ పరాజయంపై కోచ్ గౌతమ్ గంభీర్

ఇంగ్లండ్‌తో తొలి టెస్ట్ పరాజయంపై టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ స్పందించాడు. ఇది సమష్టి వైఫల్యమని, ఏ ఒకరి వల్లో ఈ పరాజయం ఎదురవ్వలేదని స్పష్టం చేశాడు. తమ జట్టు ఓడినా.. గెలిచినా.. కలిసికట్టుగానే చేస్తుందని తెలిపాడు. తొలి ఇన్నింగ్స్‌లో 570-580 పరుగులు చేసి ఉంటే ఫలితం మరోలా ఉండేదని అభిప్రాయపడ్డాడు. ఐదు టెస్ట్‌ల అండర్సన్-సచిన్ ట్రోఫీలో భాగంగా లీడ్స్ వేదికగా మంగళవారం ముగిసిన మ్యాచ్‌లో టీమిండియా 5 వికెట్ల తేడాతో ఓటమిపాలైన విషయం తెలిసిందే. చెత్త ఫీల్డింగ్, లోయరార్డర్ వైఫల్యం టీమిండియా విజయవకాశాలను దెబ్బతీసింది. ఈ మ్యాచ్ అనంతరం మీడియా సమావేశంలో పాల్గొన్న గౌతమ్ గంభీర్.. ఆటగాళ్లకు అండగా నిలిచాడు.'ఈ మ్యాచ్ ఓటమికి ఏ ఒక్క ఆటగాడిని లేదా జట్టును నిందించడానికి నేను ఇక్కడ లేను. మేం కలిసి గెలుస్తాం. కలిసి ఓడిపోతాం. భారత బౌలింగ్ విభాగం అనుభవం లేనిది. సిరాజ్, బుమ్రా మినహా మిగతా బౌలర్లకు టెస్ట్ క్రికెట్ ఆడిన అనుభవం లేదు. వీరిలో ఒకరు మూడు, మరొకరు ఐదు మ్యాచ్‌లు ఆడితే.. ఇంకొకరు అరంగేట్రమే చేయలేదు. 2022లో జట్టులో 40 మ్యాచ్‌లు ఆడిన అనుభవం కలిగిన పేసర్లు ఉన్నారు కాబట్టి 20 వికెట్లు తీసేవారు. కానీ ప్రస్తుత బౌలింగ్ విభాగానికి అంత అనుభవం లేదు. వారికి తగిన సమయం ఇవ్వాలి.



ప్రసిద్ధ్ కృష్ణ, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్ వంటి బౌలర్లు భవిష్యత్తులో రాణించడానికి తగిన మద్దతు ఇవ్వాలి. కేవలం ఒక టెస్ట్ ఆధారంగా వారిని అంచనా వేయడం సరికాదు.తొలి ఇన్నింగ్స్‌లో 570-580 పరుగులు చేసి ఉంటే మ్యాచ్‌పై పట్టు సాధించేవాళ్లం.లోయరార్డర్ బ్యాటింగ్ వైఫల్యం నిరాశకు గురిచేసింది. యశస్వి జైస్వాల్ వంటి అత్యుత్తమ ఆటగాళ్లు క్యాచ్‌లు వదిలేయడం సరికాదు. కానీ ఏ ఆటగాడు ఉద్దేశపూర్వకంగా అలా చేయరు. వరల్డ్ బెస్ట్ ఆటగాళ్లు కూడా క్యాచ్‌లు వదిలేస్తారు. శార్దూల్ ఠాకూర్‌ను బౌలింగ్ ఆల్‌రౌండర్‌గానే జట్టులోకి తీసుకున్నాం. కానీ రవీంద్ర జడేజా అద్భుతంగా బౌలింగ్ చేయడంతో కెప్టెన్ సహజంగానే తక్కువ ఓవర్లు ఇచ్చి ఉంటాడు. రెండో ఇన్నింగ్స్‌లో శార్దూల్ కీలకమైన రెండు వికెట్లు తీసాడు. కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్‌కు ఇదే తొలి మ్యాచ్. అతనికి కాస్త సమయం ఇవ్వాలి. కెప్టెన్‌గా సక్సెస్ అవ్వడానికి కావాల్సిన అన్ని లక్షణాలు శుభ్‌మన్ గిల్‌లో ఉన్నాయి. కెప్టెన్‌గా అరంగేట్ర మ్యాచ్‌లోనే సెంచరీ సాధించాడు.ఈ సిరీస్‌లో జస్‌ప్రీత్ బుమ్రా మూడు మ్యాచ్‌లు మాత్రమే ఆడుతాడు. అతను ఆడే తదుపరి రెండు మ్యాచ్‌లు ఏంటా? అనేవి ఇంకా నిర్ణయించలేదు. అతని వర్క్‌లోడ్‌ను మేం పరిశీలించాల్సి ఉంది. యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్, కేఎల్ రాహుల్ సెంచరీలు చేయడంతో పాటు రిషభ్ పంత్ రెండు సెంచరీలు చేశాడు. వాస్తవానికి ఇది అద్భుతమైన ఆరంభం.'అని గౌతమ్ గంభీర్ చెప్పుకొచ్చాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 471 పరుగులు చేసింది. అనంతరం ఇంగ్లండ్ 465 పరుగులు చేయడంతో భారత్‌కు 6 పరుగుల స్వల్ప ఆధిక్యం దక్కింది. రెండో ఇన్నింగ్స్‌లో టీమిండియా 364 పరుగులు చేసింది. దాంతో ఇంగ్లండ్ ముందు 371 పరుగుల భారీ లక్ష్యం నమోదైంది. లక్ష్యఛేధనకు దిగిన ఇంగ్లండ్ 82 ఓవర్లలో 5 వికెట్లకు 373 పరుగులు చేసి గెలుపొందింది. బెన్ డకెట్(170 బంతుల్లో 21 ఫోర్లు, సిక్స్‌తో 149) సెంచరీతో చెలరేగగా.. జాక్ క్రాలీ(126 బంతుల్లో 7 ఫోర్లతో 65), జోరూట్(84 బంతుల్లో 6 ఫోర్లతో 53 నాటౌట్) హాఫ్ సెంచరీలతో రాణించారు.

# కార్ల్‌సన్‌కు చెమటలు పట్టించాడు





న్యూఢిల్లీ: ఐదుసార్లు వరల్డ్ చాంపియన్, నార్వే దిగ్గజ గ్రాండ్‌మాస్టర్ మాగ్నస్ కార్ల్‌సన్‌కు తొమ్మిదేళ్ల చిన్నోడు ఆరిత్ కపిల్ చెమటలు పట్టించాడు. 'ఎర్లీ టైటిల్ ట్యూస్‌డే' అనే ఆన్‌లైన్ టోర్నీలో బుధవారం వీరిరువురూ తలపడ్డారు. నిర్ణీత సమయం ముగియడానికి వేసిన రెండు ఎత్తుల ముందు వరకు కార్ల్‌సన్‌పై కపిల్ పూర్తి ఆధిపత్యం చెలాయించాడు. అయితే సమయం ముగియడంతో కపిల్ తప్పని పరిస్థితుల్లో డ్రాకు అంగీకరించాడు. ప్రస్తుతం జార్జియాలో అండర్-10 వరల్డ్ చాంపియన్‌షిపలో ఆడుతున్న కపిల్ అక్కడ బస చేస్తున్న హోటల్ గది నుంచే కార్ల్‌సన్‌తో ఈ టోర్నీలో ఆడాడు. చెస్ ప్రపంచంలో కార్ల్‌సన్-కపిల్ మధ్య జరిగిన ఈ పోటీ చర్చనీయాంశంగా మారింది. గత ఏడాది భువనేశ్వర్‌లో జరిగిన ఒక చెస్ టోర్నీలో ఉజ్బెకిస్థాన్ జీఎం రాసెట్ జియాటిడినోవ్‌పై అద్భుత విజయానంతరం కపిల్ పేరు మార్మోగిపోయింది.



# చెత్తరికార్డును మూటగట్టుకున్న గిల్..!!

లీడ్స్‌లోని హెడింగ్లీలో జరిగిన తొలి టెస్ట్ మ్యాచ్‌లో ఇంగ్లాండ్ భారత్‌ను ఘోరంగా ఓడించింది. 5 మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లోని ఈ మొదటి మ్యాచ్ చివరి రోజు చివరి సెషన్ వరకు ఉత్కంఠభరితమైన పోటీని చూసింది. ఇంగ్లాండ్ 371 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి 5 వికెట్లు మిగిలి ఉండగానే విజయం సాధించింది. ఇది ఇంగ్లాండ్ గడ్డపై టెస్ట్ క్రికెట్‌లో రెండవ అత్యధిక విజయవంతమైన పరుగుల వేట అని చెప్పవచ్చు. ఇంగ్లాండ్ ఓపెనర్ బెన్ డకెట్ చివరి రోజున 149 పరుగుల అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడి ఇంగ్లండ్ విజయానికి పునాది వేశాడు. ఇప్పుడు భారత్ 148 సంవత్సరాల టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఒకే మ్యాచ్‌లో ఐదుగురు బ్యాట్స్‌మెన్ నుండి సెంచరీలు సాధించినప్పటికీ ఓటమిని ఎదుర్కొన్న మొదటి జట్టుగా నిలిచింది.రిషబ్ పంత్ రెండు ఇన్నింగ్స్‌లలోనూ సెంచరీలు (134, 118) సాధించగా.. కెప్టెన్ శుభ్‌మాన్ గిల్ (147), యశస్వి జైస్వాల్ (101), కేఎల్ రాహుల్ (137) కూడా సెంచరీలు చేశారు. కానీ ఈ సెంచరీలన్నీ కూడా వృధా అయ్యాయి. ఈ ఓటమితో శుభ్‌మాన్ గిల్ కెప్టెన్‌గా తన తొలి టెస్ట్ మ్యాచ్‌ను కూడా కోల్పోయాడు. ఈ మ్యాచ్ అనేక చారిత్రక రికార్డులను సృష్టించింది. ముఖ్యంగా ఓటమి ఉన్నప్పటికీ భారత బ్యాటింగ్ పరంగా...అత్యధిక వ్యక్తిగత సెంచరీలు చేసిన జట్టుగా భారత్ కొత్త రికార్డును సృష్టించింది. రెండు ఇన్నింగ్స్‌లలో సెంచరీలు చేసిన యశస్వి జైస్వాల్, శుభ్‌మాన్ గిల్, కెఎల్ రాహుల్, రిషబ్ పంత్ లు మంచి ఆటతీరు కనబరిచారు. భారత జట్టు మొత్తం 5 సెంచరీలు చేసింది. ఇది ఓడిపోయిన జట్టు సాధించిన విజయం అని చెప్పవచ్చు. అంతకుముందు ఈ రికార్డు 1928/29లో ఆస్ట్రేలియా పేరు మీద ఉంది. ఆ సమయంలో వారు ఇంగ్లాండ్‌పై 4 సెంచరీలు చేశారు. టీమిండియా మొత్తం 835 పరుగులు చేసింది. ఇది టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఓడిపోయినప్పటికీ ఏ జట్టు అయినా చేసిన నాల్గవ అత్యధిక పరుగులు. మరో ఆసక్తికరమైన విషయం ఏంటంటే.. టాప్-4లో ఈ రికార్డు ఇంగ్లాండ్‌పై మూడుసార్లు నమోదు చేసింది. అది కూడా బెన్ స్టోక్స్, బ్రెండన్ మెకల్లమ్ కెప్టెన్సీలో.

# తొలి టెస్టు ఓడినా పంత్ ఆల్‌టైమ్ రికార్డ్



## ర్యాంకింగ్స్‌లో ఏడో ప్లేస్ కు దూసుకొచ్చిన పంత్

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ తాజాగా విడుదల చేసిన ర్యాంకింగ్స్?లో టీమ్ఇండియా యంగ్ బ్యాటర్ రిషభ్ పంత్ సత్తా చాటాడు. బుధవారం రిలీజైన టెస్టు ర్యాంకింగ్స్?లో పంత్ కెరీర్ అత్యుత్తమ స్థానం దక్కించుకున్నాడు. ఒక స్థానం మెరుగుపర్చుకున్న పంత్ ప్రస్తుతం 801 రేటింగ్స్?తో ఏడో ప్లేస్?కు దూసుకొచ్చాడు. టీమ్ఇండియా ఓపెనర్ యశస్వీ జైస్వాల్ (851 రేటింగ్స్?) నాలుగో ప్లేస్?లో కొనసాగుతుండగా, ఇంగ్లాండ్ స్టార్ బ్యాటర్ జో రూట్ (889 రేటింగ్స్?) అగ్ర స్థానాన్ని పదిలం చేసుకున్నాడు.రీసెంట్?గా హెడింగ్లీలో ఇంగ్లాండ్?తో ముగిసిన టెస్టులో పంత్ అద్భుతంగా ఆకట్టుకున్నాడు. రెండు ఇన్నింగ్స్?ల్లోనూ సెంచరీ బాది జట్టుకు గౌరవప్రదమైన స్కోర్ అందించాడు. తొలి ఇన్నింగ్స్?లో 134 రన్స్ చేయగా, రెండో ఇన్నింగ్స్?లో 118 పరుగుల సాధించాడు. దీంతో ఒకే మ్యాచ్?లో రెండు ఇన్నింగ్స్?లోనూ సెంచరీ నమోదు చేసిన రెండో బ్యాటర్?గా రికార్డుల్లోకెక్కాడు. పంత్ కంటే ముందు జింబాబ్వే దిగ్గజ బ్యాటర్ అండీ ఫ్లవర్ ఈ ఫీట్ సాధించాడు. కాగా, టీమ్ఇండియా కెప్టెన్ శుభ్?మన్ గిల్ రీసెంట్?గా ఇంగ్లాండ్?పై సెంచరీతో ఏకంగా ఐదు స్థానాలు మెరుగుపర్చుకున్నాడు. గిల్ ప్రస్తుతం 660 రేటింగ్స్?తో 20వ స్థానంలో ఉన్నాడు. ఇక టాప్ 10లో టీమ్ఇండియా నుంచి జైస్వాల్, పంత్ ఇద్దరు బ్యాటర్లే ఉన్నారు. మరోవైపు, బౌలింగ్ విభాగంలో భారత స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా 903 రేటింగ్స్?తో టాప్?లోనే ఉన్నాడు. ఇటీవల ఇంగ్లాండ్?పై తొలి ఇన్నింగ్స్?లో ఐదు వికెట్లతో రాణించిన బుమ్రా అగ్రస్థానం పదిలం చేసుకున్నాడు. టాప్ 10లో టీమ్ఇండియా నుంచి బుమ్రా ఒక్కడే ఉండడం గమనార్హం. సీనియర్ స్పిన్నర్ రవీంద్ర జడేజా మూడు స్థానాలు దిగజారి, 13వ ప్లేస్ (706 రేటింగ్స్?)కు పడిపోయాడు.

# నాలుగు దేశాల టోర్నీలో భారత్‌కు మూడో స్థానం

బెర్లిన్: నాలుగు దేశాల జూనియర్ హాకీ టోర్నీలో భారత జట్టు 2-1తో ఆస్ట్రేలియాను ఓడించింది. బుధవారం మూడో స్థానం కోసం జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ తరపున రోహిత్ (45వ నిమిషంలో), అజీత్ యాదవ్ (52వ ని.) రెండు గోల్స్ చేశారు. ఆట 40వ నిమిషం వరకు ఇరు జట్లు ఒక్క గోల్ కూడా కొట్టలేకపోయాయి. ఈ సమయంలో ఆట 43వ నిమిషంలో ఆసీస్ కెప్టెన్ టోబి మల్లోన్ తొలి గోల్ కొట్టి, ఆ జట్టును ఆధిక్యంలో నిలిపాడు.



# అవును.. హార్దిక్ పాండ్యాతో డేటింగ్ చేశా..

## నటి ఈషా గుప్తా సంచలన వ్యాఖ్యలు..

టీమిండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా (తో బాలీవుడ్ హీరోయిన్ ఈషా గుప్తా డేటింగ్‌లో ఉన్నట్టు కొన్నేళ్ల క్రితం ప్రచారం జరిగింది. ఆ ప్రచారంపై అటు హార్దిక్, ఇటు ఈషా గుప్తా స్పందించలేదు. ఆ తర్వాత హార్దిక్ నటాషా అనే యువతిని వివాహం చేసుకుని ఆమె నుంచి కూడా విడిపోయాడు. కాగా, హార్దిక్‌తో డేటింగ్ ప్రచారంపై తాజాగా ఈషా గుప్తా స్పందించింది. తాను గతంలో హార్దిక్‌తో డేటింగ్ (%ఞ్ఱఅస్త్ర%) చేసినట్టు అంగీకరించింది. అయితే తమది పూర్తి స్థాయి డేటింగ్ కాదని తెలిపింది.'మా ఇద్దరి మధ్య గతంలో స్నేహం ఉంది. కొన్ని నెలల పాటు మాట్లాడుకున్నాం. మేమిద్దరం పూర్తి స్థాయి డేటింగ్ చేశామని చెప్పలేను. మా స్నేహం ప్రారంభమైనప్పుడే మా రిలేషన్ ముందుకు వెళ్లవచ్చు లేదా అక్కడితో ఆగిపోనూ వచ్చు అనుకున్నాం. అయితే మేం ఓ రిలేషన్‌షిప్‌లోకి అడుగుపెట్టే ముందే మేం విడిపోయాం. కొన్ని నెలల పాటే మా అనుబంధం కొనసాగింది. ఆ సమయంలో రెండు, మూడు సార్లు కలిశాం. ఆ తర్వాత విడిపోయాం' అని ఈషా గుప్తా చెప్పుకొచ్చింది. తమది పూర్తి స్థాయి డేటింగ్ అని చెప్పలేం అని తెలిపింది







# వరుస ఆఫర్లతో మమిత ఎక్కడా తగ్గట్లేదు

ఆ హీరోయిన్ వరుస ఆఫర్లతో ఎక్కడా తగ్గట్లేదుగా సినీ ఇండస్ట్రీలో ఎవరికెప్పుడు అదృష్టం కలిసొస్తుందో ఎవరూ చెప్పలేం. అందుకే ఇండస్ట్రీలో ప్రతీ వారం స్టార్లు మారుతూ ఉంటారని. ఒక వారం ఒకరు విన్నర్ అయి స్టార్ గా నిలిస్తే, ఇంకోవారం ఇంకొకరు స్టార్ అవుతారు. ఎవరెప్పుడు, ఎలా స్టార్లుగా మారతారనేది ఎవరూ ఊహించలేం. అలా ప్రేమలు సినిమాతో ఓవర్ నైట్ స్టార్ అయిపోయింది ఆ సినిమాలో నటించిన మమిత బైజు.ప్రేమలు సినిమా తర్వాత మమిత క్రేజ్ ఒక్కసారిగా పెరిగిపోయింది. ఆ సినిమా కంటే ముందు మమిత మలయాళంలో పలు సినిమాలు చేసినప్పటికీ వాటన్నింటితో రాని క్రేజ్ ప్రేమలు సినిమాతో వచ్చింది. కేవలం మలయాళంలో కాకుండా ఆ సినిమా రిలీజైన ప్రతీ భాషలోనూ అమ్మడికి ఫ్యాన్స్ ఏర్పడ్డారు. అందులో భాగంగానే మమితకు ఆఫర్లు క్యూ కడుతున్నాయి.అమ్మడు కూడా క్రేజ్ ఉన్నప్పుడే వరుస పెట్టి సినిమాలు చేయాలనే ఉద్దేశంతో తనకు వచ్చిన ఆఫర్లలో ది బెస్ట్ సెలెక్ట్ చేసుకుంటూ కెరీర్లో ముందుకు దూసుకెళ్తుంది. ప్రేమలు సినిమా మమిత కెరీర్ ను ఎంతగా మార్చిందంటే ఆ సినిమా తర్వాత ఏకంగా తనకు సూర్య, విజయ్ లాంటి హీరోలతో నటించే ఛాన్సులు తెచ్చి పెట్టేంత. విజయ్ నటిస్తున్న ఆఖరి సినిమా జన నాయగన్ లో మమిత కీలక పాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే.వెంకీ అట్లూరి దర్శకత్వంలో వస్తోన్న సూర్య46లో ఏకంగా సూర్య సరసన నటిస్తోంది. వీటితో పాటూ ప్రదీప్ రంగనాథన్ తో కలిసి డ్యూడ్ సినిమా చేస్తోంది. ఆల్రెడీ చేస్తున్న ఇరండు వానం రిలీజ్ కు రెడీ అయింది. ఇక రీసెంట్ గా ప్రేమలు సినిమాలో అమూల్ డెవిస్ పాత్రలో కనిపించిన సంగీత్ ప్రతాప్ తో కలిసి ఓ సినిమా చేయడానికి మమిత గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది మమిత. ఈ సినిమా పూర్తి స్థాయి ప్రేమ కథా చిత్రంగా రాబోతుంది. ప్రేమలు తర్వాత మలయాళ, తమిళ సినిమాల్లో బాగా బిజీగా మారిన మమిత, సూర్య46 తర్వాత తెలుగు లో కూడా బిజీ అయ్యే అవకాశాలున్నాయి.





# హాలీవుడ్ లోకి వరలక్ష్మి

దక్షిణాది సినీ ప్రేక్షకులకు సుపరిచితురాలైన నటి వరలక్ష్మి శరత్‌కుమార్ తన కెరీర్‌లో మరో కీలక మైలురాయిని చేరుకున్నారు. సీనియర్ నటుడు శరత్‌కుమార్ కుమార్తెగా చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టినప్పటికీ, తనదైన నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆమె, ఇప్పుడు హాలీవుడ్ చిత్రంలో నటించే అవకాశాన్ని దక్కించుకున్నారు. 'రిజానా- ఏ కేజ్డ్ బర్డ్' పేరుతో తెరకెక్కుతున్న ఈ సినిమా ద్వారా వరలక్ష్మి అంతర్జాతీయ ప్రేక్షకులను పలకరించనున్నారు.

ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో వరలక్ష్మి హాలీవుడ్ లెజెండరీ నటుడు జెరెమీ ఐరన్స్‌తో కలిసి నటించనుండటం విశేషం. జెరెమీ ఐరన్స్ తన అద్భుతమైన నటనకు గాను పలు అంతర్జాతీయ పురస్కారాలు అందుకున్నారు. ఈ సినిమాలో విధుషికా రెడ్డి కూడా ఒక ముఖ్యమైన పాత్రలో కనిపించనున్నారు. శ్రీలంకకు చెందిన ప్రముఖ దర్శకుడు చంద్రన్ రత్నం ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. యదార్థ సంఘటనల స్ఫూర్తితో ఈ సినిమా కథ రూపుదిద్దుకుంటున్నట్లు సమాచారం.'రిజానా- ఏ కేజ్డ్ బర్డ్' సినిమా చిత్రీకరణ ప్రస్తుతం శ్రీలంకలోని అందమైన లొకేషన్లలో జరుగుతోంది. సుమతి స్టూడియోస్ బ్యానర్‌పై ప్రవీణ్, విధుషికా రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, అభిమానులు, సినీ ప్రముఖులు వరలక్ష్మికి శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

# తొలి భారతీయ సెలబ్రిటీగా..

## అరుదైన ఫీట్ సాధించిన రాజమౌళి..



స్టార్ డైరక్టర్ రాజమౌళిగురించి కొత్తగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. బాహుబలి సినిమాతో దేశవ్యాప్తంగా పాపులారిటీ తెచ్చుకున్న జక్కన్న.. 'ఆర్ఆర్ఆర్'తో గ్లోబల్ సెలబ్రిటీ అయిపోయారు. ఈ చిత్రాల్లో నటించిన ప్రభాస్(బాహుబలి), ఎన్టిఆర్, రామ్‌చరణ్(ఆర్ఆర్ఆర్) లను పాన్ ఇండియా స్టార్స్‌ని చేశారు రాజమౌళి. ప్రస్తుతం ఆయన మహేశ్ బాబుతో సినిమా తీస్తున్నారు. అయితే తాజాగా ఆయన ఓ అరుదైన ఫీట్‌ని సాధించారు. ఆర్ఆర్ఆర్ సినిమాను జపాన్‌లో విడుదల చేసిన క్రమంలో రాజమౌళి.. జపనీస్ వీడియో గేమ్ క్రియేటర్ హిడియో కోజిమానిని కలిశారు. అయితే మహేశ్‌తో సినిమా కోసం ఈయన కలిసి పని చేస్తారని అప్పట్లో చర్చ జరిగింది.

కానీ ఇప్పుడు అది అవాస్తవమని తేలింది. కోజిమా సృష్టించిన 'డెత్ స్టాండింగ్ 2'లో రాజమౌళితో పాటు ఆయన కుమారుడు కార్తికేయా కనిపించారు. ఇంటర్‌నేషనల్ వీడియో గేమ్‌లో కలిపించిన పాన్ వరల్డ్ స్టార్ అయిపోయారు రాజమౌళి. అంతేకాక వీడియో గేమ్‌లో కనిపించిన తొలి భారతీయ సెలబ్రిటీగా ఆయన రికార్డు సృష్టించారు. ఈ వీడియో గేమ్‌లో రాజమౌళి కనిపించిన క్లిప్ ఇప్పుడు సోషల్‌మీడియాలో వైరల్ అవుతోంది.ఇక మహేశ్ బాబుతో రాజమౌళి గ్లోబ్ ట్రాటింగ్ జంగిల్ అడ్వెంచర్ మూవీని తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే హైదరాబాద్, ఒడిశాలో ఈ సినిమా కొంత షూటింగ్ జరిగింది. త్వరలో మరో షెడ్యూల్ షూటింగ్ కోసం టీమ్ కెన్యాకు వెళ్లనున్నారని తెలుస్తోంది. ఇక ఈ సినిమాలో ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమా కోసం సినీ చరిత్రలోనే రూ.50 కోట్లు పెట్టి అత్యంత ఖరీదైన వారణాసి సెట్‌ని హైదరాబాద్‌లో నిర్మిస్తున్నారని టాక్ వినిపిస్తోంది.



## కోలీవుడ్ ను కుదిపేస్తున్న డ్రగ్స్ కేసు..

# మరో నటుడి కోసం పోలీసుల గాలింపు

చెన్నై: తమిళ సినీ ఇండస్ట్రీని డ్రగ్స్ కేసు కుదిపేస్తోంది. పలువురు సినీ నటులు, సంబంధిత వ్యక్తులు డ్రగ్స్ తీసుకుంటున్నట్లు సమాచారం అందుకున్న చెన్నై నార్కోటిక్స్ ఇంటలిజెన్స్ పోలీసులు.. వారిని పట్టుకునేందుకు రంగంలోకి దిగారు. ఇప్పటికే డ్రగ్స్ కేసులో నటుడు శ్రీరామ్ ను పోలీసులు అరెస్టు చేశారు. మాజీ ఎఐఎడిఎంకె కార్యనిర్వాహకుడు ప్రసాద్ నుండి డ్రగ్స్ కొన్నట్లు ఆరోపణలు రావడంతో శ్రీరామ్‌ను అదుపులోకి తీసుకున్నారు. రాజీవ్ గాంధీ ప్రభుత్వ ఆస్పత్రిలో ఆయన రక్త నమూనాలు సేకరించి వైద్య పరీక్షలు నిర్వహించగా.. డ్రగ్స్ తీసుకున్నట్లు తేలింది. దీంతో శ్రీరామ్ ను అరెస్టు చేసి విచారించారు. ఆయన ఇచ్చిన సమాచారంతో మరో నటుడు కృష్ణ కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ కేసులో మొదట విచారణకు వచ్చిన నటుడు కృష్ణ తర్వాత పరారైనట్లు సమాచారం. తమిళ యువ దర్శకులు, మ్యూజిక్ డైరెక్టర్లతో కృష్ణకు సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు గుర్తించిన పోలీసులు.. ఆయనను పట్టుకునేందుకు ఐదు ప్రత్యేక బృందాలను రంగలోకి దించారు. కాగా, టాలీవుడ్ నటులతోనూ కృష్ణకు సన్నిహిత సంబంధాలు తెలుస్తోంది.

# రాజకీయాలపై అవగాహన లేదు

## విజయ్ ఆంటోనీ ఇంట్రెస్టింగ్ కామెంట్స్



ప్రముఖ నటుడు విజయ్ ఆంటోనీ తన రాజకీయ ప్రవేశంపై వస్తున్న ఊహాగానాలకు తెరదించారు. తనకు రాజకీయాలపై పెద్దగా అవగాహన లేదని, ప్రస్తుతానికి ఆ దిశగా ఆలోచనలు లేవని స్పష్టం చేశారు. ఆయన కథానాయకుడిగా నటించిన 'మార్గన్' సినిమా ప్రచార కార్యక్రమాల్లో భాగంగా బుధవారం ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు.రాజకీయ ప్రవేశం గురించి విజయ్ ఆంటోనీ మాట్లాడుతూ… "నటీనటులు ఏదో ఒక సమయంలో రాజకీయాల్లోకి రావాలన్న నియమమేమీ లేదు. ఒకవేళ ప్రజాసేవ చేయాలనే తలంపుతో రాజకీయాల్లోకి అడుగుపెట్టినా, వారికి ప్రజల నుంచి పూర్తి మద్దతు లభించాలి. అప్పుడే వారు అధికారంలోకి రాగలుగుతారు. నిజం చెప్పాలంటే, నాకు రాజకీయాలపై అంతగా అవగాహన లేదు. కేవలం ఫేమ్ ఉంది కదా అని రాజకీయాల్లోకి ప్రవేశించలేం. ముందుగా ప్రజల సమస్యలను క్షుణ్ణంగా అర్థం చేసుకోగలగాలి" అని అన్నారు.ఇదే సమయంలో మాదకద్రవ్యాల కేసులో నటుడు శ్రీకాంత్ అరెస్ట్ కావడం పట్ల కూడా విజయ్ ఆంటోనీ స్పందించారు. సినీ పరిశ్రమలో డ్రగ్స్ వాడకం అనేది కొత్త విషయం కాదని, ఈ సమస్య చాలా కాలంగా ఉందని ఆయన ఆరోపించారు. ఎంతోమంది మత్తు పదార్థాలకు బానిసలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీకాంత్‌కు సంబంధించిన కేసు ప్రస్తుతం దర్యాప్తు దశలో ఉందని, ఇందులో నిజానిజాలు త్వరలోనే వెలుగులోకి వస్తాయని ఆయన తెలిపారు.విజయ్ ఆంటోనీ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'మార్గన్'. లియో జాన్‌పాల్ దర్శకత్వం వహించిన ఈ సినిమాతో విజయ్ మేనల్లుడు అజయ్ ధీషన్ ప్రతినాయకుడిగా తెలుగు తెరకు పరిచయం అవుతున్నారు. మర్డర్ మిస్టరీ క్రైమ్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ చిత్రంలో సముద్రఖని, దీప్షిక తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా జూన్ 27న ప్రేక్షకుల ముందుకు రానుంది.

## ఇటు 'విరాటపాలెం' సిరీస్ రిలీజ్ ఆపాలంటూ కోర్టుకి వెళ్లిన ఈటీవీ విన్




జీ 5 ఓటీటీలో ఈ నెల 27వ తేదీ నుంచి 'విరాటపాలెం –పీసీ మీనా రిపోర్టింగ్'నే సిరీస్ స్ట్రీమింగ్ కానుంది. ఇందుకు సంబంధించిన ప్రమోషన్స్ కొన్ని రోజులుగా నడుస్తున్నాయి. పోలూరు కృష్ణ దర్శకత్వం వహించిన ఈ సూపర్ నేచురల్ థ్రిల్లర్ లో, అభిజ్ఞ – చరణ్ లక్కరాజు ప్రధానమైన పాత్రలను పోషించారు. 1980లలో .. ఒక మారుమూల గ్రామంలో నడిచే కథ ఇది. ఆ గ్రామంలో పెళ్లి చేసుకోవాలనుకున్న యువతులు, పెళ్లికూతురుగా ఉండగానే అనుమానాస్పదంగా చనిపోతూ ఉంటారు. అందుకు కారణం ఏమిటనేది ఎవరికీ అర్థం కాదు. తమ గ్రామానికి అదొక శాపం కావొచ్చని నమ్ముతారు. అలాంటి పరిస్థితుల్లో ఆ ఊరికి ఒక లేడీ కానిస్టేబుల్ వస్తుంది. ఆమె రాకతో ఏం జరుగుతుందనేది కథ. అయితే ఇప్పుడు ఈ సిరీస్ రిలీజ్ ను నిలిపివేయాలని కోరుతూ, ఈటీవీ విన్ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. తమ ఫ్లాట్ ఫామ్ పై త్వరలో విడుదల కానున్న 'కానిస్టేబుల్ కనకం' కథతోనే 'విరాటపాలెం' సిద్ధమైందనే విషయాన్ని కోర్టు దృష్టికి తీసుకొచ్చింది. 'కానిస్టేబుల్ కనకం'గా వర్ష బొల్లమ్మ నటించిన ఈ సిరీస్ కి, ప్రశాంత్ కుమార్ దిమ్మల దర్శకత్వం వహించాడు. మరి ఒకే కథతో రూపొందిన ఈ రెండు సిరీస్ ల విషయం ఎటువైపు వెళుతుందో చూడాలి.